PRAJASAKTI Regd.No. 15795/68 సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 28 | విజయవాడ, సోమవారం 28 ఆగస్టు 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 28 August 2023 | Rs

నేడు విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినం

విద్యుత్ రంగంలో వినాశకర సంస్కరణలు వ్యతిరేకిస్తూ సాగిన మహోద్యమంలో అశువులు బాసిన అమరవీరుల సంస్మరణ దినం నేడు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నివాళి కార్యక్రమాలు, సభలు, సదస్సులు నిర్వహించాలని వామపక్షాలు పిలుపునిచ్చాయి.

ప్రతిపక్షాల ఐక్యతతో బిజెపికి భయం!

ఇండియా కూటమిలోకి మరిన్ని పార్టీలు

నితీష్ కుమార్ వెల్లడి

పాట్నా : ప్రతిపక్షాల ఐక్యతను చూసి బిజెపి భయపడుతోందని బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ వ్యాఖ్యానించారు. ముంబయిలో ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్, ఇన్‌క్లూజివ్ అలయన్స్ (ఇండియా) మూడవ సమావేశం జరగనున్న నేపథ్యంలో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన మరికొన్ని రాజకీయ పార్టీలు కూటమిలో చేరనున్నాయని నితీష్ చెప్పారు. ముంబాయి సమావేవం ఈ చేరికలకు వేదికవుతుందని అన్నారు. "గతంలో ప్రతిపక్షాలన్నీ చెల్లాచెదురుగా వున్నాయి. కానీ నా చొరవ నేపథ్యంలో ఇప్పుడు అన్ని పార్టీలు ఒక తాటిపైకి వచ్చాయి. ప్రతిపక్షాలు సమైక్యంగా వ్యవహరిస్తున్నందువల్ల తాము నష్టపోతామని వారు (బిజెపి) భయపడుతున్నారు. అందువల్లే వారు నాపై ధ్వజమెత్తుతున్నారు. ఆ విమర్శలను నేను పట్టించుకోను, నా పని చేసుకుంటూ పోతాను." అని చెప్పారు.

పాట్నా, బెంగళూరుల్లో ఇప్పటికే ఇండియా కూటమి సమావేశాలు రెండు జరిగిన సంగతి తెలిసిందే. ఈ నెల 31, సెప్టెంబరు 1 తేదీల్లో ముంబయిలో మూడో సమావేశం జరగనుంది. అక్కడ భవిష్యత్ వ్యూహ రూపకల్పన జరగనుంది. ఈ సమావేశంపై నితీష్ మాట్లాడుతూ

లోక్‌సభ సీట్లపై కూడా ఈసారి చర్చ జరుగుతుందని చెప్పారు. ఏ సీటు నుండి ఎవరు పోటీ చేయాలనే అంశాన్ని కూడా చర్చించాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. అనేక అంశాలపై చర్చిస్తామని, కొన్ని సమస్యలకు పరిష్కారం కూడా దొరుకుతుందని అన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు పెద్దగా సమయం లేనందున బహుశా ముంబయి సమావేశమే చివరి సమావేశం కావచ్చునని అన్నారు.

మరోవైపు బీహార్ డిప్యూటీ ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ కూడా ప్రధానిపై తీవ్రంగా విమర్శలు చేశారు. పేదలు, రైతులు, మొత్తంగా దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా సంస్కరణల పేరుతో దేశంలోని ప్రభుత్వ సంస్థలను, వనరులను ప్రైవేటు కంపెనీలకు అమ్మేస్తున్నారంటూ విమర్శించారు. లక్షల కోట్ల విలువైన జాతీయాస్తులను ఎంపిక చేసిన ప్రైవేటు కంపెనీలకు ఎందుకు అమ్ముతున్నారు? దేశ సంపదను మోడీ ప్రభుత్వం పెంచలేనపుడు స్వాతంత్ర్యానంతరం దశాబ్దాల తరబడి కష్టపడి సంపాదించుకున్న ఆస్తులను చవకబారు ధరలకు అమ్ముతూ ఎందుకు దేశానికి నష్టం కలిగిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఇలాచేయడం వల్ల దేశానికి, ఆర్థిక వ్యవస్థకు ఎలా లాభమో మోడీ ప్రభుత్వం వివరించాలని ఆయన డిమాండ్ చేశారు.కొద్దిమంది పెట్టుబడిదారుల చేతుల్లో దేశాన్ని తాకట్టుపెట్టేందుకు, విక్రయించేందుకు జరుగుతున్న ఈ ప్రయత్నాలనుఅడ్డుకునేందుకు ఈ దేశ ప్రజలు చివరికంటా పోరాడాతరని అన్నారు.

ఏనుగులకు 2 కారిడార్లు

• ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం • వీటి పరిధిలోకి 60 గ్రామాల ప్రజానీకం

- కర్నాటక, తమిళనాడు మీదుగా చిత్తూరు జిల్లా వరకు ఒకటి
- పలమనేరు, కుప్పం నుండి తిరుపతి వరకు మరొకటి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఏనుగుల కోసం రాష్ట్రంలో రెండు కారిడార్లను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వీటిలో ఒకటి అంతరాష్ట్ర కారిడార్ కాగా, మరొకటి రాష్ట్రంలోనే అంతర్‌జిల్లా కారిడార్. ఇవి రెండు కాకుండా ఆంధ్రప్రదేశ్-ఒడిషా సరిహద్దుల్లో కూడా ఏనుగుల కదలికలను అధికారికంగా గుర్తించారు. రాష్ట్రంలో వన్య మృగాల సంచారం ఇప్పటికే ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. పులులు, చిరుతపులులు, ఏనుగులు ఎలుగుబంట్లు ఇటీవల కాలంలో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లోకి జనావాసాల్లోకి వస్తున్న సంఘటనలు తెలిసిందే. తిరుమలలో ఇటీవలే ఒక చిన్నారిని చిరుత కబళించింది. కొన్ని ప్రాంతాల్లో పశువులు వీటి బారిన పడ్డాయి. మరికొన్ని చోట్ల పండ్లతోటలు, పంటపొలాలు ధ్వంసమైనాయి. వీటిని నివారించి, ప్రజల ప్రాణాల రక్షణకు తీసుకున్న చర్యలు దాదాపు శూన్యం. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కారిడార్లలో



మూడు రాష్ట్రాల మధ్య విస్తరించిన ట్రై జంక్షన్ కారిడార్

60 రెవిన్యూ గ్రామాల్లో ప్రజానీకం నివసిస్తున్నారు. వీరిలో అధికభాగం వ్యవసాయం, పండ్లతోటలపైనే ఆధారపడి ఉన్నారు. కారిడార్‌ల ప్రకటనతో ఏనుగుల రక్షణకు ప్రాధాన్యత లభించనుంది. దీంతో వీరి జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారనుంది. ఈ మార్గంలో జాతీయ రహదారులతో పాటు, రైలు మార్గాలు కూడా ఉన్నాయి. స్థానిక ప్రజలతో పాటు, ఈ మార్గాలో ప్రయాణం చేసే ప్రయాణీకుల భద్రతకు ఎటువంటి చర్యలు తీసుకుంటారన్న విషయం స్పష్టత లేదు. ఈ విషయాలేమి మిగతా 2లో

పులుల కోసం కూడా...

రాష్ట్రంలో పులల కోసం కూడా ఒక కారిడార్‌ను ప్రతిపాదిస్తున్నారు. పాత కర్నూలు, అనంతపురం, కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో ఈ మార్గం ఉంది. ఇది ఎక్కువభాగం అటవీ ప్రాంతంలోనే ఉందని, పెన్నా నది ప్రవాహ ప్రాంతంలో కొన్ని జనవాసా లున్నప్పటికీ పులుల రాకపోకలకు పెద్దగా ఆటంకం కాకపోవచ్చని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ మార్గంలో ఇప్పటికే రెండు పులులు సురక్షితంగా ప్రయాణం చేశాయని చెప్పారు. శ్రీశైలం అభయారణ్యం నుండి శేషాచల అడవుల వరకు ఆ పులులు వెళ్లివచ్చినట్లు గుర్తించినట్లు చెబుతున్నారు. అవి ప్రయాణం చేసిన మార్గాన్నే పులుల కారిడార్‌గా ప్రతిపాదించారు. దీనిని అధికారికంగా నోటిఫై చేయాల్సిఉంది.

లోపలి పేజీలో...

దేశ భవిష్యత్తును కాపాడాలంటే బిజెపిని గద్దె దించాలి

- శ్రామిక మహిళా 9వ రాష్ట్ర సదస్సులో డాక్టర్ కె హేమలత

అవినీతిపరులకు అందలం

- టిటిడి బోర్డు కూర్పుపై వి.శ్రీనివాసరావు విమర్శ
- ఎస్‌సి. ఎస్‌టిలకూ స్థానం కల్పించాలి
- చంద్రయాన్‌కూ మతం రంగు

రేపు క్రీడా దినోత్సవం

- పాఠశాల కమిషనర్ ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ధ్యాన్‌చందర్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ క్రీడల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు అందచేయడంతో పాటుక్రీడా ప్రతిభ అవార్డులను ఇవ్వాలన్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో పాఠశాల క్రీడా సమాఖ్య క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన 130 పాఠశాలలను ఎంపిక చేశామని కమిషనరుతోపాటు స్కూల్ గేమ్స్ రాష్ట్ర కార్యదర్శి జి భానుమూర్తిరాజు మరో ప్రకటనలో తెలిపారు. జిల్లాకు ఐదు పాఠశాలల చొప్పున ఎంపిక చేశామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రాల్లో అవార్డులు ప్రదానం ఉంటుందని వివరించారు.

డిసెంబర్ 4న 'చలో పార్లమెంట్'

- జాతీయ దళిత్ సమ్మిట్ పిలుపు
- సమస్యలపై జాతీయ ఉద్యమం
- 2024 ఎన్నికల్లో దళితుల సమస్యలే రాజకీయ ఎజెండా

దళిత సమ్మిట్‌లో అభివాదం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై జాతీయస్థాయిలో ఉద్యమాన్ని నిర్మించనున్నట్టు జాతీయ దళిత సమ్మిట్ ప్రకటించింది. అందులో భాగంగా డిసెంబర్ నాలుగో తేదీన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపింది. సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ ఆధ్వర్యంలో రెండురోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ దళిత్ సమ్మిట్ ఆదివారం విజయవంతంగా ముగిసింది. 24 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 92 సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 322 మంది ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పది మందితో జాతీయస్థాయి సమన్వయ కమిటీని ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మల్లేపల్లి లక్ష్మయ్య, మాజీ ఎంపి రామచంద్ర డోమ్, వివిఎస్ నిర్మల్, ధీరేంద్ర ఝా, గుల్జార్‌సింగ్ గోరియా, డాక్టర్ విక్రంసింగ్, కర్నైల్‌సింగ్ ఎక్‌లాహ, బి వెంకట్, సాయిబాలాజీ, వీణా పల్లికల్ సమన్వయ కమిటీ సభ్యులుగా ఎన్నికయారు.

దళితుల సమస్యలు రాజకీయ ఎజెండాగా మారాలి : బి వెంకట్

ఉత్పత్తి రంగంలో ప్రధాన భూమిక పోషిస్తున్న దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, 75 ఏండ్లుగా అవి అమలవుతున్న తీరును చర్చించాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ పిలుపునిచ్చారు. రాజ్యాంగంలో పొందుపర్చిన సామాజిక అంశాలను ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. కులనిర్మూలన జరగా లంటూ రాజ్యాంగంలో ఉన్నా అమలుకు నోచుకో వడం లేదని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లయినా కుల వివక్ష, దళితులపై దాడులు, సామాజిక అణచివేత నేటికీ కొనసాగడం సిగ్గుచేటని అన్నారు. పేదరికం మిగతా 2లో

ఇసుకపై టిడిపి ఆందోళన

- నేటి నుండి ప్రత్యక్ష కార్యాచరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అధికార వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నేతలు చేస్తున్న ఇసుక అక్రమాలు, దోపిడీపై తెలుగుదేశం పార్టీ ఆందోళనకు కార్యాచరణ ప్రకటించింది. ఈ నెల 28, 29, 30 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ప్రత్యక్ష పోరాటాలకు దిగాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆదివారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. 28వ తేదీన వైసిపి నాయకులు అక్రమంగా మైనింగ్ చేస్తున్న ఇసుక రీచ్‌ల వద్ద ఆయా గ్రామస్తులతో కలిసి పార్టీ శ్రేణులు నిరసనలు తెలపాలని కోరింది. 29వ తేదీన ఇసుక అక్రమ దోపిడికి సంబంధించిన వివరాలను సాక్ష్యాదారాలతో తహశీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని తెలిపింది. అలాగే 30వ తేదీన అన్ని నియోజవర్గాల నాయకులు విజయవాడలోని ఇబ్రహీంపట్నంలో వున్న మైనింగ్ శాఖ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించాలని తెలిపింది.

చంద్ర ఉష్ణోగ్రత

• అందిన తొలి పరిశోధన • ఇస్రో ప్రకటన

బెంగళూరు: చంద్రుడి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా అడుగుపెట్టిన చంద్రయాన్-3 తొలి శాస్త్రీయ పరిశోధన వివరాలను పంపింది. ఈ వివరాలను ఇస్రో ఆదివారం వెల్లడించింది. చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండర్‌లోని 'చంద్రాస్ సర్ఫేస్ థర్మో ఫిజికల్ ఎక్స్‌పరిమెంట్ (చస్తే)' పేలోడ్ చంద్రుడి ఉపరితలంపై, కాస్త లోతులో సేకరించిన ఉష్ణోగ్రతల గణాంకాలను గ్రాఫ్ రూపంలో ఇస్రో వెల్లడించింది.'చాస్టే పేలోడ్.. చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద నేల పైపొర ఉష్ణోగ్రతలను లెక్కిస్తుంది. దీని ద్వారా చంద్రుడి ఉపరితల థర్మల్ ధర్మాలను అర్థం చేసుకునేందుకు అవకాశం లభిస్తుంది. చంద్రుడి నేలపై 10 సెంటిమీటర్ల లోతువరకు చొచ్చుకెళ్లి, ఉష్ణోగ్రతలను లెక్కించే సామర్థ్యం ఈ పేలోడ్‌కు ఉంది. దీనికి 10 సెన్సర్లు అమర్చి ఉన్నాయి' అని ఇస్రో పేర్కొంది. చంద్రుడి ఉపరితలంపైన, కాస్త లోతులో నమోదైన ఉష్ణోగ్రత వైవిధ్యాలు సంబంధిత గ్రాఫ్‌లో కనిపిస్తున్నట్లు చెప్పింది. ఇస్రో విడుదల చేసిన గ్రాఫ్ ప్రకారం.. చంద్రుడి ఉపరితలంపై ఉష్ణోగ్రత సుమారు 50 డిగ్రీలుగా ఉంది. అదే 80 మిల్లీమీటర్ల లోతులో దాదాపు -10 డిగ్రీలుగా చూపిస్తోంది. చంద్రుడి దక్షిణ ధ్రువంలో ఉష్ణోగ్రతలకు సంబంధించి ఇవి మొదటి వివరాలు అని ఇస్రో వెల్లడించింది. పూర్తిస్థాయి పరిశీలనలు జరుగుతున్నాయని చెప్పింది. విక్రమ్ ల్యాండర్ మాడ్యూల్‌లోని రాంభా, చంద్రాస్ సర్ఫేస్ థర్మో ఫిజికల్ ఎక్స్‌పరిమెంట్, ఇన్‌స్ట్రుమెంట్ ఫర్ లూనార్ సీస్మిక్ యాక్టివిటీ పేలోడ్‌లను గురువారమే ప్రారంభమయ్యాయి, దీంతో 'చంద్రయాన్-3' మిషన్ ఇప్పటికే తన రెండు లక్ష్యాలను పూర్తి చేసుకున్నట్లు ఇస్రో ఇప్పటికే ప్రకటించింది.



చంద్రుడుపై ఉష్ణోగ్రతల గురించి ఇస్రో విడుదల చేసిన గ్రాఫ్

మధ్య ప్రదేశ్‌లో దారుణం

దళితుడి హత్య... అతని తల్లిని వివస్త్రను చేసిన దుండగులు

భోపాల్ : బిజెపి పాలనలో దళితులు, మైనార్టీలపై సాగుతున్న దమనకాండకు అంతులేకుండా పోతోంది. తాజాగా లైంగిక వేధింపుల కేసును ఉపసంహరించుకోవడానికి నిరాకరించిన ఒక దళిత యువతి సోదరుడిని హత్య చేయడంతో పాటు, ఆమె తల్లిని వివస్త్రను చేసిన అమానుష సంఘటన మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో చోటుచేసుకుంది. గురువారం జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విక్రమ్‌సింగ్ ఠాకూర్ మరికొందరితో కలిసి ఒక దళిత యువతిపై 2019లో లైంగింక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై ఆ ఏడాదే కేసు నమోదైంది. అప్పటి నుండి కేసును ఉపసంహరించుకోవాలని దళిత కుటుంబంపై ఠాకూర్ ఒత్తిడి తీసుకువస్తున్నాడు. దీనికి ఎప్పటికప్పుడు దళిత యువతి కుటుంబం తిరస్కరిస్తూ వస్తోంది. దీంతో రెచ్చిపోయిన ఠాకూర్ గురువారం బాధితురాలిపై ఇంటిపై దాడిచేశాడు. అడ్డుకున్న ఆమె సోదరుడు 18 ఏళ్ల నితిన్ అహిర్వార్‌ను చితకబాది చంపేశాడు. తల్లి జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించడంతో ఆమెను వివస్త్రను చేశారు. మృతుడి సోదరి మాట్లాడుతూ పరారీలో వున్న కోమల్ సింగ్‌తో కలిసి విక్రమ్ సింగ్, అజాద్ సింగ్‌లు తన ఇంటికి వచ్చారని, కేసును ఉపసంహరించుకోవాలని ఒత్తిడి తెచ్చారని, అందుకు తిరస్కరించడంతో ఈ అమానుష కాండకు పాల్పడ్డారని చెప్పారు. దాంతో వెంటనే తాను సమీప అడవిలోకి పరుగెత్తి పోలీసుల సాయం కోరానని ఆమె వివరించారు. ఈ ఘటనకు సంబంధించి ప్రధాన నిందితుడితో సహా 8మందిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో ఒకరైన కోమల్ సింగ్‌తో సహా మరికొంతమంది పరారీలో వున్నారు. వారిని పట్టుకోవడానికి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులపై, ప్రధాన నిందితుడితో పాటూ అరెస్టు చేసిన మరో 8మందిపై హత్య కేసు నమోదు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, బిఎస్‌పి చీఫ్ మాయావతి ఈ సంఘటనను తీవ్రంగా ఖండించారు.

పశ్చిమ బెంగాల్‌లో ఘోరం

- బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు
- ఆరుగురి మృతి

కోల్‌కతా: బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు సంభవించి అందులో పనిచేస్తున్న ఆరుగురు కార్మికులు మరణించిన ఘోర ఘటన పశ్చిమ బెంగాల్ లో చోటు చేసుకుంది. ఉత్తర 24 పరగణా జిల్లాలోని ఈ దారుణం జరిగింది. ఈ ప్రమాదంలో మరో ఐదుగురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పేలుడు ధాటికి భవనం పైకప్పు కూలింది. ఘటనాస్థలంలో మృదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. అయితే.. ఈ ఫ్యాక్టరీని ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇళ్ల మధ్యలో నిర్వహిస్తున్నారని సమాచారం. పశ్చిమబెంగాల్ స్టేట్ యూనివర్సిటీకి మూడు కిలోమీటర్ల దూరంలోనే ఈ ఫ్యాక్టరీ ఉంది. ఈ ప్రమాదం నేపథ్యంలో సమీప ఇళ్లలో నివసిస్తున్నవారిని అధికారులు అప్రమత్తం చేసి అక్కడి నుంచి తరలించారు. ఈ ప్రమాదంలో మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

ప్రవీణ్ ప్రకాష్‌ను తప్పించాలి

యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను మానసికంగా వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తూ మాట్లాడుతున్న పాఠశాల ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ను ఆ బాధ్యత నుంచి తప్పించాలని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానించింది. ఈ సమావేశం తీర్మానాలను మీడియాకు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్.ప్రసాద్ తెలియజేశారు. కౌన్సిల్ మధ్యంతర సమావేశం ప్రకాశం జిల్లా ఒంగోలులోని ఎన్‌టిఆర్ కళాక్షేత్రంలో, ఈ సందర్భంగా బహిరంగ సభ రైస్ మిల్లర్ల అసోసియేషన్ హాలులో ఆదివారం జరిగింది. దీనికి ముందు ర్యాలీ నిర్వహించారు. ప్రవీణ్ ప్రకాష్‌ను తొలగించాలని కౌన్సిల్ సమావేశంలో పెట్టిన తీర్మానంపై సభ్యులు స్పందిస్తూ 'గో బ్యాక్ ప్రవీణ్ ప్రకాష్' అంటూ నినాదాలు చేస్తూ చేతులు ఎత్తారు. జిఒ నెంబరు 117ని రద్దు చేయాలని, పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని సమావేశం డిమాండ్ చేసింది. ఉపాధ్యాయులను కించపరుస్తూ మాట్లాడుతున్న అధికారులు రెండు నెలలపాటు ఉపాధ్యాయులుగా పనిచేయడానికి సిద్ధమా? అనే తీర్మానాన్ని కౌన్సిల్‌లో ఏకగ్రీవంగా ఆమోదించారు. పర్యవేక్షణ పేరుతో ప్రవీణ్ ప్రకాష్ కించపరుస్తూ మాట్లాడుతున్నారని, ఉపాధ్యాయులను ఇబ్బందిపెడితే చూస్తూ ఊరుకోబోమని రాష్ట్ర నేతలు హెచ్చరించారు.

సభలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్

పాఠశాలల పర్యవేక్షణను యుటిఎఫ్ స్వాగతిస్తోందని, ఆ పేరుతో ఉపాధ్యాయుల మనోభావాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సహించేది లేదని కౌన్సిల్ గట్టిగా హెచ్చరించింది. ఉపాధ్యాయులపై క్రిమినల్ కేసులు పెట్టాలని మాట్లాడుతున్న అధికారులు... గత మూడు నెలల సకాలంలో వేతనాల రాకపోతే ఏం చేస్తున్నారని నిలదీసింది. వేతనాలు సకాలంలో చెల్లించని అధికారులు క్రిమినల్ కేసులు పెట్టించుకోవడానికి సిద్ధమా? అని ప్రశ్నించింది. పాఠశాలలో బోధనేత పనులకు ఉపాధ్యాయులను వినియోగించుకుంటూ.. బోధన కుంటుపడేలా ప్రభుత్వ విధానాలున్నాయని కౌన్సిల్ ఆందోళన వ్యక్తం చేసింది. జిఒ నెంబరు 117 వల్ల ప్రస్తుతం విద్యా శాఖ గందరగోళంలో పడిందని పేర్కొంది. బదిలీలు జరిగిన మూడు నెలల్లోనే మళ్లీ సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను కదిలించడం వల్ల నాణ్యమైన విద్య విద్యార్థులకు అందుతుందా? అని యుటిఎఫ్ నేతలు ప్రశ్నించారు. కౌన్సిల్ సమావేశంలో చేసిన తీర్మానాలను బలపరుస్తున్నట్లు బహిరంగ సభలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ కె.లక్ష్మణరావు ప్రకటించారు. ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి తక్షణం డిఎస్‌సిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పోరాటాలకు సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారు. ప్రవీణ్ ప్రకాష్‌ను వెంటనే ఆ బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య మిగతా 2లో

పిఎస్‌యుల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

• డి చంద్రశేఖర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఎపి పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ దమ్మాలపాటి చంద్రశేఖర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న వారి ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల కృషి ఫలితంగా చాలా సంస్థలు లాభాలు గడిస్తూ ప్రభుత్వానికి డివిడెండ్ చెల్లిస్తున్నాయని పేర్కొన్నారు. జగనన్న ఇళ్లు, ప్రజా పంపిణీ, విత్తనాల పంపిణీ, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, టూరిజం, ధాన్యం నిల్వలు, ఆబ్కారీ వ్యాపారం ఇలా అనేక సంస్థలు ప్రభుత్వం నిర్దేశించిన బాధ్యతలు నిర్వహిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

కలశంపై మాయమైన తాపడం

బంగారు కలశ తాపడం మాయం

ప్రజాశక్తి-గుడివాడ (కృష్ణా జిల్లా)

కృష్ణా జిల్లా గుడివాడ రూరల్ మండలంలోని శ్రీ బాల త్రిపుర సుందరీ దేవి దేవాలయంలో కిలో బంగారు కలశ తాపడం ఆదివారం మాయమైంది. గుడివాడ మండలంలోని సిద్ధాంతం గ్రామంలోని అడుసుమిల్లి సేవా ట్రస్టుకు చెందిన శ్రీ బాల త్రిపుర సుందరి దేవి సమేత శ్రీదుర్గా నాగేశ్వరస్వామి దేవస్థాన రెండు శిఖర కలశాలపై కిలోకిపైగా బరువు ఉన్న బంగారు తాపడాలను కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. శిఖల కలశాలపై ఒక తాపడం మాయం కావడంతో దేవస్థానం అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. బంగారు తాపడాన్ని దొంగలు ఎత్తుకెళ్లారా, లేదా గాలికి ఎగిరిపోయిందా? అన్న కోణంలో పోలీసులు విచారణ ప్రారంభించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, తాలూకా ఎస్‌ఐ ఎన్ లక్ష్మీ నరసింహమూర్తి తెలియజేశారు. కిలో బంగారు తాపడం మాయం కావడం గుడివాడలో సంచలనం సృష్టించింది.

ప్రవీణ్ ప్రకాష్‌ను తప్పించాలి

(మొదటి పేజీ తరువాయి)

అందదనే స్పృహ ప్రభుత్వానికి ఉండాలని హితవు పలికారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ చేసిన తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, సిఎంఒలో విద్యా శాఖ చూస్తున్న అధికారులకు అందజేస్తామన్నారు. తక్షణం ప్రవీణ్‌ప్రకాష్‌ను తొలగించకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి పిలుపునివ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు హెచ్చరించారు. కౌన్సిల్ సమావేశానికి యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మాజీ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్, ఎఎన్.కుసుమకుమారి, రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి, రాష్ట్ర కార్యదర్శులు హాజరయ్యారు. బహిరంగ సభలో వందలాది మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తును కాపాడాలంటే

బిజెపిని గద్దె దించాలి

• శ్రామిక మహిళా 9వ రాష్ట్ర సదస్సులో డాక్టర్ కె హేమలత

ప్రజాశక్తి- గుడివాడ

దేశ భవిష్యత్తును కాపాడుకోవాలంటే బిజెపిని గద్దె దించాల్సిన అవసరం ఉందని సిఐటియు అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ కె హేమలత అన్నారు. శ్రామిక మహిళ 9వ రాష్ట్ర సదస్సు గుడివాడలోని కామ్రేడ్ రంజన నిరూల నగర్ (కమ్మవారి సత్రం)లో ఆదివారం జరిగింది. ముందుగా సిఐటియు జెండాను హేమలత ఎగురవేశారు. అనంతరం జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ భారతదేశ రాజ్యాంగాన్ని మార్చి రాయాలనే ఆలోచనతో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ప్రయత్నిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపిని గద్దె దించితేనే దేశం బాగుపడుతుందని, మళ్లీ బిజెపి అధికారంలోకి వస్తే మనం సాధించుకున్నవన్నీ కోల్పోతామని అన్నారు.

ఇప్పటికే సామాన్యులకు అందుబాటులో లేకుండా ధరలు పెంచడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు, రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ లైంగిక వేధింపుల చట్టం ఉన్నా అమలు కావడం లేదన్నారు. అసంఘటిత రంగంలో కూడా ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేసి అవి పనిచేసేలా చూడాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీల్లో లైంగిక వేధింపులు విపరీతంగా పెరుగుతున్నాయని, లైంగిక వేధింపులు చేసిన వారిని వదిలి వేధింపులపై ఫిర్యాదు చేసిన వారిని దోషులుగా చేస్తున్నారని అన్నారు.

శ్రామిక మహిళ 9వ రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న హేమలత

పలు తీర్మానాలు ఆమోదం

అధిక ధరలు తగ్గించాలని, నిత్యావసర సరుకులను చౌకధరల దుకాణాల ద్వారా సరఫరా చేయాలని, కేరళ తరహాలో చౌకదుకాణాల ద్వారా 16 రకాల సరుకులు అందించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రెగ్యులరైజ్ చేయాలని, శ్రామిక మహిళల సమస్యలు పరిష్కరించాలని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం పటిష్టంగా అమలు చేయాలని, బాలికలు, మహిళలపై హింసను అరికట్టాలని, హింసలేని సమాజం కోసం పోరాడాలని సదస్సులో తీర్మానించారు. సదస్సులో నివేదికను కె.ధనలక్ష్మి, సంతాప తీర్మానాన్ని కె.నాగమణి ప్రవేశపెట్టారు.

కామేశ్వరి, ధనశ్రీ, నిర్మలమ్మ, వరలక్ష్మి అధ్యక్షవర్గంగా, సిఐటియు ఆఫీస్ బేరర్స్ జి.బేబీరాణి, సుబ్బారావమ్మ, డి రమాదేవి, కె.ధనలక్ష్మి స్టీరింగ్ కమిటీగా వ్యవహరించారు. ఈ సదస్సుకు ఎల్‌ఐసి వర్కింగ్ ఉమెన్స్ స్టేట్ కన్వీనర్ సూర్యప్రభ, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు వరలక్ష్మి, రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి 24 రంగాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. 23 జిల్లాల నుండి 16 రంగాల నుంచి చర్చల్లో పాల్గొన్నారు.

అవినీతిపరులకు అందలం

• టిటిడి బోర్డు కూర్పుపై వి.శ్రీనివాసరావు విమర్శ
• ఎస్‌సి. ఎస్‌టిలకూ స్థానం కల్పించాలి
• చంద్రయాన్-3 విజయానికి మతం రంగు



విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పక్కన సిపిఎం నేతలు హనీఫ్, ఆంజనేయులు

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు అవినీతి పరులతో నిండిపోయిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో సిపిఎం ప్రకాశం జిల్లా విస్తృత సమావేశం ఆదివారం జరిగింది. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ టిటిడి బోర్డులో ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రాతినిధ్యం ఉండాలన్నారు. అర్చక మండలిలోనూ ఆదివాసీలకు, దళితులకు స్థానం కల్పించాలని కోరారు. చంద్రయాన్-3 విజయం జాతీయ వారసత్వ సంపదని చెప్పారు. శాస్త్రవేత్తల కృషి ఫలితంగానే ఆ విజయం లభించిందన్నారు. ఈ విజయానికి మోడీ మతం రంగు పులమాలని ప్రయత్నించడం సరికాదన్నారు. ఈ విజయం ప్రధాని మోడీ సొంతం కాదని చెప్పారు. రోజురోజుకూ పెరుగుతోన్న నిత్యావసర సరుకుల ధరల వల్ల ప్రజలపై తీవ్ర భారం పడిందని, మోడీ అధికారంలోకి రాకముందు రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ఇప్పుడు రూ.1200కు పెరిగిందన్నారు. పెట్రోలు, డీజిల్ ధరలూ నిరంతరం పెరుగుతూనే ఉన్నాయని తెలిపారు. కూరగాయల ధరలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఇటీవల వరకూ సామాన్యుడు టమాటాను కొనేస్థితి లేదన్నారు. కిలో రూ.200కు పెరిగిందని గుర్తు చేశారు. పెరిగే ధరలను నియంత్రించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు మోపిందని తెలిపారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని2014 ఎన్నికల్లో మోడీ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. ఏడాదికి కనీసం రెండు లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని తెలిపారు. పైగా, గత నాలుగేళ్లలో కోటి యాభై లక్షల మంది కార్మికులు ఉద్యోగాలను కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని మోడీ నిర్వీర్యం చేశారన్నారు. కేంద్రంలోనూ ఉద్యోగాల భర్తీ లేనందున పోస్టులు భారీగా ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

జిల్లాలో కరువు నివారణకు చర్యలు చేపట్టాలని, కరువు ప్రాంతాల్లో ప్రజలకు తాగునీరు, పంటలకు సాగునీరు అందించాలని, విద్యుత్ కోతలు నివారించాలని, జిల్లాలో మహిళలు, దళితులు, విద్యార్థినులపై అఘాయిత్యాలను నివారించాలని, విలీనం పాఠశాలలు బలహీనపడ్డాయని, వాటిని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సమావేశంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

'యూనివర్సిటీ' 6న విడుదల

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అక్టోబరు ఆరవ తేదీన 'యూనివర్సిటీ' సినిమాను విడుదల చేయనున్నట్లు సినీ నిర్మాత, దర్శకులు ఆర్.నారాయణమూర్తి తెలిపారు. అనంతపురంలోని ఎన్‌జిఒ హోంలో జరిగిన మీడియా సమావేశంలో కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, ప్రముఖ రచయిత శాంతినారాయణ, విశాలాంధ్ర బుక్‌హౌస్ ఇన్‌ఛార్జ్ ఈశ్వరరెడ్డి, మానవతా రక్తదాతల సంస్థ నిర్వాహకులు తరిమెల అమర్‌నాథరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. విద్య, వైద్యం రెండూ సేవా రంగాలని తెలిపారు. ఈ రెండింటినీ వ్యాపారమయంగా మార్చేశారని విచారం వ్యక్తం చేశారు. ప్రధానంగా విద్యా రంగం వ్యాపారమయమైందని, పుట్టగొడుగుల్లా ప్రయివేటు సంస్థలు పుట్టుకొస్తున్నాయని తెలిపారు. ఈ ఇతివృత్తంతోనే పరీక్షా పేపర్ల లీక్ ఆధారంగా 'యూనివర్సిటీ' సినిమాను రూపొందించినట్లు చెప్పారు. ఈ సినిమాను ప్రజలందరూ ఆదరించాలని కోరారు. కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి మాట్లాడుతూ విద్యారంగంలో విపరీతమైన పోటీ కారణంగా ప్రయివేటు విద్యా సంస్థలు అనైతిక మార్గాలను అనుసరిస్తున్నాయని విమర్శించారు. సమాజంలో నెలకొన్న అనేక రుగ్మతలకు వ్యతిరేకంగా సినిమాలను రూపొందించడంలో నారాయణమూర్తి ముందుంటారని కొనియాడారు. ప్రముఖ రచయిత శాంతి నారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యా రంగంలో నెలకొన్న స్థితిగతులపై యూనివర్సిటీ సినిమాను రూపొందించారని చెప్పారు.

దొంగ ఓట్లపై నేడు ఇసిని కలవనున్న వైసిపి

• దళిత సంక్షేమంపై చర్చకు రావాలని చంద్రబాబుకు మంత్రి మేరుగ సవాల్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో 60 లక్షల దొంగ ఓట్లను టిడిపి హయాంలో చేర్పించారని, వీటిని పరిశీలించి తొలగిస్తుంటే ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు ఎన్నికల కమిషన్‌కు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. గుంటూరులో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. తాము కూడా ఎన్నికల కమిషన్‌ను సోమవారం కలిసి టిడిపి నాయకులు చేర్చిన దొంగ ఓట్ల వ్యవహారంపై ఫిర్యాదు చేస్తామన్నారు. చంద్రబాబు ఇప్పటి వరకు దొంగ ఓట్లతోనే కుప్పంలో గెలుపొందారని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దొంగ ఓట్లను తొలగించడం వల్ల టిడిపి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోయిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఇవే ఫలితాలు పునరావతం కాబోతున్నాయని, చంద్రబాబుకు కూడా కుప్పంలో ఓటమి తప్పదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే ఓర్వలేని చంద్రబాబు, లోకేష్ తాము 28 పథకాలు రద్దు చేసినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. 2014 నుంచి 2018 వరకు అమలు చేసిన పథకాలకు, గత నాలుగేళ్లలో దళితులకు అమలు చేసిన పథకాలపై చంద్రబాబు నాయుడు తనతో నేరుగా బహిరంగ చర్చకు రావాలని మంత్రి నాగార్జున సవాల్ విసిరారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ సిఎం అయ్యేనాటికి 11.5 శాతంగా ఉన్న రాష్ట్రంలోని పేదరికం ఇప్పుడు 6 శాతానికి తగ్గిందని అన్నారు.

నేడు తల్లుల ఖాతాల్లోకి రూ.680.44 కోట్లు

• నగరిలో బటన్ నొక్కనున్న సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జగనన్న విద్యాదీవెన-పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంటుకు సంబంధించి త్రైమాసికం నగదు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో సోమవారం జమకానుంది. 2023 ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి సంబంధించి 9,32,235 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ 8,44,336 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.680.44 కోట్లు జమకానున్నాయి. చిత్తూరు జిల్లా నగరిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి జమచేయనున్నారు.

నేడు విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ దినం

• రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని వామపక్షాల పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ పోరాట అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సోమవారం నాడు నివాళి కార్యక్రమాలు, సభలు, సదస్సులు రాష్ట్ర వ్యాప్తంగా జరపాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో టిడిపి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలు, ప్రపంచ బ్యాంకు సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అమరులైన కామ్రేడ్ రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి 23వ వర్ధంతి నిర్వహించనున్నట్లు తెలిపాయి. ఎన్నికలకు ముందు విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశాయి. తగ్గించకపోగా, 100 శాతం ఛార్జీలు పెంచిన నేపథ్యంలో విద్యుత్ అమరవీరులను స్మరించుకోవడం మరింత అవసరమని తెలిపాయి. దీనిలో భాగంగానే సోమవారం విజయవాడలోని లెనిన్ సెంటర్ వద్ద అమరవీరులకు వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు నివాళులర్పించనున్నారు. విద్యుత్ ఛార్జీలను వ్యతిరేకించే ప్రజలందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని వామపక్షాలు కోరాయి.

దీక్షల్లో కూర్చున్న విశాఖ ఉక్కు శ్రామిక సంఘం నాయకులు

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే హక్కు ఎవరిచ్చారు ? : టిఎన్‌టియుసి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

జాతి సంపదైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేసే హక్కు కేంద్ర ప్రభుత్వానికి ఎవరిచ్చారని టిఎన్‌టియుసి విశాఖ జిల్లా నాయకులు బొడ్డు పైడిరాజు ప్రశ్నించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 927వ రోజుకు చేరాయి. దీక్షల్లో విశాఖ ఉక్కు శ్రామిక సంఘం కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు రా మెటీరియల్‌ను, వర్కింగ్ క్యాపిటల్‌ను సమకూర్చితే లాభాల బాటలోకి వస్తుందన్నారు. ప్లాంట్‌ను భవిష్యత్తులో 20 మిలియన్ టన్నుల ఉత్పత్తికి విస్తరించొచ్చని, దీంతో లక్ష మందికి ఉపాధి కూడా లభిస్తుందని తెలిపారు. ఆ పని చేయకుండా ఉత్పత్తిని నిలిపివేసి ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ఈ క్రమంలోనే స్టీల్ యాజమాన్యం రోజు రోజుకూ ఉత్పత్తిని తగ్గిస్తూ వస్తోందని తెలిపారు. ఐక్య పోరాటాలతో ప్లాంట్‌ను కాపాడుకునేందుకు కార్మికవర్గం కృషి చేస్తోందన్నారు. దీక్షల్లో నాయకులు బొడ్డు రమణ, పంచదార్ల పెంటారావు, కరణం బాలయోగి, ధవళి తిరుపతిరావు, వియ్యపు వెంకునాయుడు, ఉరుకూటి వెంకటరావు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంపై దుష్ప్రచారం

• మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికారంలో వున్నంతకాలం రైతులకు ఏమీ చేయని చంద్రబాబు, ఇప్పుడు అధికారం లేకపోయేసరికి జగన్ ప్రభుత్వంపై అబద్ధాలతో దుష్ప్రచారానికి దిగుతున్నారని పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. రైతులకు ఏ పనీ చేయని చంద్రబాబు రైతు ద్రోహిగా మిగిలిపోయారన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని రీతిలో రైతులకు జగన్‌మోహన్‌రెడ్డి మేలు చేస్తున్నారని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో దళారీ వ్యవస్థను చంద్రబాబు ప్రోత్సహిస్తే, తమ ప్రభుత్వ హయాంలో ఆర్‌బికెల ద్వారా ప్రతి గింజనూ కొనుగోలు చేయించామన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా రైతుల ఖాతాలకు డబ్బు జమ చేశామని తెలిపారు. చంద్రబాబు హయాంలో 2.65 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తే, ఈ నాలుగేళ్ల కాలంలో తమ ప్రభుత్వం 3.10 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. టిడిపి హయాంలో 17.94 లక్షల మంది రైతులకు రూ.40,236 కోట్లు మాత్రమే చెల్లింపులు చేస్తే, తమ ప్రభుత్వం 32.78 లక్షల మందికి రూ.58,765 కోట్లు చెల్లింపులు చేశామన్నారు. చంద్రబాబు ధాన్యం కోనుగోళ్లలోనే కాదు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్‌లు ఇచ్చే విషయంలోనూ రైతులను మోసం చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం ఏ సీజన్‌కు ఆ సీజన్‌లోనే ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా ఇస్తున్నామని తెలిపారు.

ఇ-క్రాప్ రిజిస్ట్రేషన్ ఆధారంగా వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా అమలు

• వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనరు హరికిరణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇ-క్రాప్ రిజిస్ట్రేషన్ ఆధారంగా వైఎస్ఆర్ పంటల బీమా పథకం-పిఎంఎఫ్‌బివైని అత్యంత పారదర్శకంగా రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనరు సి హరికిరణ్ తెలిపారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా అమలవుతున్న పంటల బీమా పథకాన్ని సమీక్షించడానికి 10వ జాతీయ సమావేశాన్ని కేంద్ర ప్రభుత్వం ఈ నెల 26, 27 తేదీల్లో ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్‌లో నిర్వహించింది. సమావేశం వివరాలను వ్యవసాయశాఖ ఆదివారం ఒక ప్రకటన ద్వారా విడుదల చేసింది. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేవలం ఇ-క్రాప్ రిజిస్ట్రేషన్ ఆధారంగా నోటిఫై చేసిన పంటను ఉచిత పంటల బీమా పథకం ద్వారా బీమారక్షణ కల్పించేలా యూనివర్సల్ కవరేజీని రాష్ట్రం సాధించిందని సభలో హరికిరణ్ వివరించినట్లు తెలిపారు. పంటల బీమా పథకానికి ఒక రూపాయి మాత్రమే రైతులు చెల్లించేలా 2019లో తొలి అడుగులు వేశామని, మహారాష్ట్ర, ఒడిశా, పుదుచ్చేరి, మేఘాలయ వంటి రాష్ట్రాలు 2023-24లో రూ.1 ప్రీమియంతో చెల్లించే విధంగా బీమాను ప్రకటించాయన్నారు. తగిన మోడల్‌ను ఎంచుకోవడానికి రాష్ట్రాలకు నిర్ణయాధికారం ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

డిసెంబర్ 4న 'చలో పార్లమెంట్'

(మొదటి పేజీ తరువాయి)

నిర్మూలన, ఉపాధి కల్పన, గౌరవంగా జీవించే హక్కు సంపూర్ణంగా అమలు కావడం లేదన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ మద్దతుతోనే దళితులు, సామాజిక తరగతులపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. దాడులకు పాల్పడే వారిని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ రక్షిస్తున్నదని అన్నారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని చెప్పారు. రాజ్యాంగ హక్కుల రక్షణ కోసం ఉద్యమిస్తామన్నారు. దేశంలో దళితుల సమస్యలే ఎజెండా కావాలని వివరించారు. చంద్రునిపైకి రాకెట్‌ను పంపించే స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందినా భారత్‌లో అంటరానితనం, వివక్ష, దోపిడీ, పీడన ఉండడం దురదృష్టకరమని అన్నారు. మోడీ ప్రభుత్వం అంబానీ, అదానీ అభివృద్ధి కోసమే పనిచేస్తున్నదని విమర్శించారు. రాజ్యాంగం స్థానంలో మనస్మృతిని, చాతుర్వర్ణాన్ని తేవాలని చూస్తున్నదని చెప్పారు. భూమి, ఉపాధి, సామాజిక న్యాయం, అందరికీ విద్య, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం, అంటరానితనాన్ని నిర్మూలించడం కోసం ఉద్యమిస్తామని అన్నారు. 2024లో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో దళితుల సమస్యలే రాజకీయ ఎజెండాగా మారాలని చెప్పారు. దీనిపై రాజకీయ పార్టీలు స్పందించాలని కోరారు. కోటి సంతకాలను సేకరించి రాష్ట్రపతికి అందజేస్తాన్నారు.

దళిత వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తాం : మల్లేపల్లి లక్ష్మయ్య

దళితులు ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలపై ఈ సమ్మిట్‌లో సుదీర్ఘంగా చర్చించామని సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ చైర్మెన్ మల్లేపల్లి లక్ష్మయ్య చెప్పారు. వాటి పరిష్కారం కోసం జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని నిర్మిస్తామన్నారు. భవిష్యత్తులో రాష్ట్రాల వారీగా సదస్సులు నిర్వహిస్తామని అన్నారు. ఆయా రాష్ట్రాల్లో ఉన్న దళితుల సమస్యలను ఎజెండాలోకి తీసుకుంటామని చెప్పారు. అక్కడ కమిటీలను ఏర్పాటు చేస్తామని వివరించారు. రాష్ట్రాల వారీగా కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. డిసెంబర్ నాలుగో తేదీన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని చేపడతామని వారు పిలుపునిచ్చారు. పదేండ్లుగా బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న దళిత వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తామని అన్నారు. దళితులు అన్ని రంగాల్లో అసమానతలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు, సామాజిక సంఘాలు, సంస్థలు, ప్రజాస్వామిక వాదులంతా ఆలోచించి ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. వివక్ష, దోపిడీ, పీడన, అణచివేత, వెలివేతకు గురవుతున్న దళితులకు అండగా నిలవాలని సూచించారు. అంటరానితనం దేశంలో లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఆ దిశగా ఈ ఉద్యమాన్ని ముందుకుతీసుకెళ్తామని చెప్పారు.

ఏనుగులకు 2 కారిడార్లు

(మొదటి పేజీ తరువాయి)

లేకుండా ఏనుగుల కారిడార్లను ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఆంధ్రా, ఒడిషా సరిహద్దు ప్రాంతంలో మరికొంత కాలంపాటు నిఘా ఉంచాలనిం సూచించింది. భవిష్యత్‌లో ఇక్కడ కూడా మరో కారిడార్‌ను ప్రకటించే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వ అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ తాజాగా ప్రచురించిన ' భారతదేశంలో ఎలిఫెంట్ కారిడార్స్-2023' నివేదికలో ఈ విషయాన్ని పేర్కొన్నారు. 2010వ సంవత్సరం తరువాత ఈ తరహా నివేదికను కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం ఇదే మొదటిసారి. దేశం మొత్తం మీద 150 కారిడార్లను ఈ నివేదికలో పేర్కొన్నారు. రాష్ట్రానికి సంబంధించిన కారిడార్లకు నివేదికలో చోటులభించడంతో ఏనుగుల సంరక్షణ మరింత సులభమవుతుందన్న అభిప్రాయాన్ని అటవీశాఖ అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

మూడు రాష్ట్రాల మధ్య....

రాష్ట్రంలో మొదటి ఏనుగుల కారిడార్‌గా కేంద్రం గుర్తించిన ప్రాంతం మూడు రాష్ట్రాల మధ్య విస్తరించిఉంది. కర్నాటకలోని కోలార్ ఫారెస్ట్ డివిజన్ కామసముద్రం అటవీ ప్రాంతం నుండి ప్రారంభమయ్యే ఈ కారిడార్ తమిళనాడులోని హోసూరు వెప్పనపల్లి రిజర్వు ఫారెస్ట్ మీదుగా ఆంధ్రపదేశ్ వరకు వ్యాపించిఉంది. రాష్ట్రంలో కుప్పం రేంజి రిజర్వు ఫారెస్ట్‌లోని కౌండిన్య అభయారణ్యం మల్లనూరు గ్రామం వరు ఈ కారిడార్ ఉంది. మొత్తం 28 కిలోమీటర్ల పొడవు, 3.5 నుంచి ఐదు కిలోమీటర్ల వెడల్పులో ఈ కారిడార్ విస్తరించినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఈ కారిడార్‌లో 15 నుండి 20 ఏనుగులు తిరుగుతున్నట్లు గుర్తించారు. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి ఏనుగులు రావడానికి అవకాశం ఉన్న ఏకైక మార్గంగా ఈ కారిడార్‌ను పేర్కొన్నారు. ఈ కారిడార్‌లో అధికభాగం మగ ఏనుగులే తిరుగుతున్నాయని నివేదికలో పేర్కొన్నారు. ఈ కారిడార్‌ను పరిరక్షించుకోకపోతే రాష్ట్రంలో ఉన్న ఏనుగులు చిన్న గుంపుగా ఒంటరిపాటుకు గురవుతాయని, ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని నివేదికలో హెచ్చరించారు.

40 రెవిన్యూ గ్రామాలు..రోడ్డు, రైలు మార్గాలు

ఈ కారిడార్‌ను అభివృద్ధి చేయడంలో ఉన్న ఇబ్బందులను కూడా నివేదికలో పేర్కొన్నారు. ట్రై జంక్షన్ కారిడార్‌గా గుర్తించిన ఈ ప్రాంతంలో 40 రెవిన్యూ గ్రామాలున్నాయి. కృష్ణగిరి-పలమనేరు నేషనల్ హైవే(ఎన్‌హెచ్ 42) కూడా ఈ మార్గం గుండానే వెడుతుంది. దాదాపు 25 కి.మీల బెంగళూరు-చెన్నై రెండు లైన్ల రైల్వే మార్గం కూడా ఈ కారిడార్ మీదగానే వెడుతుంది. జిల్లా స్థాయికి చెందిన కొన్ని ప్రధాన రోడ్లు కూడా ఈ కారిడార్‌లో ఉన్నాయి.

70 కిమీ రాయల కారిడార్

70 కి.మీ పొడవు, 11 కి.మీ వెడల్పులో విస్తరించి ఉన్న మరో కారిడార్‌ను 'రాయల ఎలిఫెంట్ రిజర్వు కారిడార్'గా కేంద్రం గుర్తించింది. చిత్తూరు జిల్లాలోని కౌండిన్య వైల్డ్‌లైఫ్ సాంచ్యురి నుండి తిరుపతి జిల్లాలోని శ్రీవెంకటేశ్వర నేషనల్ పార్క్ వరకుఇది విస్తరించి ఉంది. ఈ కారిడార్ పుంగనూర్, చిత్తూరు పశ్చిమ, బాకరాపేట్ అటవీ రేంజ్ పరిధిలో ఉంది.

ఈ కారిడార్‌లో 50 నుండి 60 ఏనుగులు తిరుగుతున్నట్లు గుర్తించారు. వెంకటేశ్వర నేషనల్ పార్కు నుండి కౌండిన్య వన్యప్రాణి సంరక్షణ కేంద్రం వరకు ఏనుగులు తిరగడానికి ఇదొక్క మార్గమే ఉందని, ఈ మార్గాన్ని చిరుతలు, ఎలుగుబంట్లు, దుప్పులు వంటి ఇతర వన్యప్రాణులు కూడా రాకపోకలకు ఉపయోగించుకుంటున్నాయని నివేదికలో పేర్కొన్నారు.

కీలక రహదారులు

ఈ కారిడార్ పరిధిలో బెంగళూరు-తిరుపతి, కడప-చిత్తూరు హైవేలు ఉన్నాయి, నూతనంగా ప్రతిపాదించిన బెంగళూరు - చెన్నై ఎక్స్‌ప్రెస్ హై వే కూడా ఈ మార్గం గుండానే వెడుతుంది. దాదాపు 50 కి.మీ మేర హైటెన్షన్ విద్యుత్ లైన్ కూడా ఉన్నట్లు గుర్తించారు. ఇవిగాక పెద్ద ఎత్తున వ్యవసాయ, రెవెన్యూ భూములు ఉన్నాయని, 20 రెవిన్యూ గ్రామాల్లో జనజీవనం కూడా ఉందని పేర్కొన్నారు. ఈ కారిడార్‌ను రాష్ట్ర అటవీ శాఖ నోటిఫై చేయాల్సి ఉంది.

కారిడార్లు ఎందుకు?

ఎలిఫెంట్ కారిడార్లను గుర్తించడం వల్ల ఏనుగుల సంరక్షణకు చర్యలు తీసుకోవడం సులభమౌతుందని అటవీశాఖాధికారులు చెబుతున్నారు. రెండు, అంతకన్నా ఎక్కువ ఉన్న ఏనుగుల నివాసాల మధ్య అనుసంధానం కోసం ఈ కారిడార్లు ఉపయోగపడుతాయని, అధికారికంగా ప్రకటించడం వల్ల మనుష్యులకు, ఏనుగులకు మధ్య ముఖాముఖి సంఘటనలను సాధ్యమైనంత మేర తగ్గించగలమని చెబుతున్నారు.

ఎసిబి దాడిలో తప్పించుకున్న ట్రాన్స్‌కో ఎఇ

ప్రజాశక్తి - మక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా)

ఓ రైతు నుంచి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ నిమిత్తం నగదు డిమాండ్ చేసిన సందర్భంగా ఎసిబి అధికారులు జరిపిన దాడుల్లో ట్రాన్స్‌కో ఎఇ పి.శాంతారాం తప్పించుకొని పరారయ్యారు. ఈ సంఘటన పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ముక్కాయవలసకు రైతు వెంకటరావు తన పొలంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ఎఇని సంప్రదించారు. అందుకు ఎఇ రూ.90 వేలు డిమాండ్ చేశారు. అందులో రూ.20 అడ్వాన్స్‌గా తీసుకున్నారు. మిగిలిన డబ్బు కోసం డిమాండ్ చేయగా, బాధిత రైతు ఎసిబి అధికారులను ఆశ్రయించారు. ఎసిబి అధికారుల సూచన మేరకు మిగిలిన మొత్తాన్ని ఎఇకి ఇచ్చారు. ఈ క్రమంలో ఎసిబి అధికారుల జాడను తెలుసుకొని రైతు నుంచి తీసుకున్న నగదును పారవేసి తన కారును విడిచిపెట్టి పరారయ్యారు. దీనిపై ఎసిబి డిఎస్‌పి రామచంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం మండల ట్రాన్స్‌కో కార్యాలయాన్ని తనిఖీ చేశారు.

ప్రారంభానికి ముందే కూలిన 'బస్ బే'

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ నగరంలోని సెంట్రల్ పార్కుకు ఎదురుగా ప్రతిష్టాత్మంగా నిర్మించిన బస్ బే ప్రారంభం కాకుండానే కూలిపోయింది. విశాఖ నగరం మరింత సుందరంగా కనబడడం కోసం సరికొత్త డిజైన్‌తో బస్ బేలను ప్రభుత్వం నిర్మిస్తోంది. అందులో భాగంగా రూ.40 లక్షలతో సెంట్రల్ పార్కునకు ఎదురుగా నిర్మించిన బస్ బే మరి కొద్దిరోజుల్లో ప్రారంభం కావాల్సి ఉండగా ఆదివారం ఉదయం కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ప్రాంతంలో మార్నింగ్ వాక్ కోసం వచ్చిన వారు ఆ సంఘటనను చూసి ఒక్కసారిగా భయంతో పరుగులు తీశారు.

సిపిఎం, జనసేన నిరసన

బస్ బే కూలిపోయిన సంఘటనను ఖండిస్తూ, అదే స్థలంలో సిపిఎం, జనసేన కార్పొరేటర్లు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ బస్ బేల పేరిట రూ.3 కోట్లను అధికార పార్టీ నాయకులు జేబులో వేసుకున్నారని విమర్శించారు. ఎటువంటి నాణ్యతా లేకుండా, ఆధునీకీకరణ పేరిట విశాఖ నగర పరిధిలో 20 చోట్ల బస్ బేలను నిర్మిస్తున్నట్టు తెలిపారు. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ మాట్లాడుతూ కౌన్సిల్ ఆమోదం లేకుండా జివిఎంసిలోని నలుగురి లబ్ధి కోసం ఇటువంటి నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు.

సంస్కృతం దేశ సంస్కృతిలో అంతర్భాగం : మల్లాది విష్ణు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంస్కృత భాష మనదేశ సంస్కృతిలో భాగమని, దేశ చరిత్రను అధ్యయనం చేసే విషయంలో ఆ భాషను నేర్చుకోవడం అత్యంత అవసరమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు అన్నారు. విజయవాడలోని సత్యనారాయణ పురంలో సంస్కృత భారతీ రాష్ట్ర ప్రాంత కార్యాలయ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు ఆచార్య దోర్బల ప్రభాకర్‌శర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ.. అన్ని శాస్త్రాలకూ మూలం సంస్కృతంలోనే ఉందన్నారు. ప్రతి విద్యార్థీ భారతీయ విజ్ఞాన సంపదను వెలికితీసి ముందుకు తీసుకెళ్లేందుకు సంస్కృతాన్ని తప్పనిసరిగా నేర్చు కోవాలని సూచించారు. ఈ భాషను సరళతరం చేసి వాడుకలోకి తెచ్చేందుకు గత నాలుగు దశాబ్దాలుగా సంస్కృత భారతి ఉద్యమ కార్యా చరణతో పని చేస్తోందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సంస్కృతం మాట్లాడే వారి సంఖ్య కేవలం 24,821 మాత్రమేనని, ఇటువంటి తరుణంలో సంస్కృతం సాహిత్యం ఔన్నత్యాన్ని భావితరాలకు అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్పొరేటర్ శర్వాణిమూర్తి పాల్గొన్నారు.

ఎల్‌ఐసి పెన్షనర్ల పట్ల కేంద్రం వివక్ష

ఐసిఆర్‌ఐఎ మచిలీపట్నం డివిజన్ 23వ మహాసభలో కె మోహనరావు

ప్రజాశక్తి- విజయవాడ

ప్రభుత్వ బీమా కంపెనీల పెన్షనర్ల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతూ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, దీనిని తిప్పికొట్టేందుకు పెన్షనర్లందరూ ఏకం కావాలని ఆలిండియా ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎఐఐపిఎ) జాతీయ ఉపాధ్యక్షులు కె.మోహనరావు పిలుపునిచ్చారు. విజయవాడలోని గవర్నర్‌పేట బాలోత్సవ్ భవన్‌లో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఐసిఆర్‌ఐఎ) మచిలీపట్నం డివిజన్ 23వ మహాసభ ఆదివారం జరిగింది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నుండి పెన్షనర్లు మహాసభకు హాజరయ్యారు. ఇ.జగన్మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మోహనరావు మాట్లాడుతూ ఫామిలీ పెన్షన్ 30 శాతం ఇవ్వడానికి యాజమాన్యాలు అంగీకరించి ప్రభుత్వ ఆమోదానికి పంపి నాలుగు సంవత్సరాలైందన్నారు. ఇతర రంగాల్లో ఆమోదించినా ఎల్‌ఐసి, జిఐసిలలో ఆమోదించకపోవడం వివక్ష చూపడమేనని విమర్శించారు. ఎల్‌ఐసి పెన్షనర్ల, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 12న తలపెట్టిన రెండు గంటల వాకౌట్ సమ్మె విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రభుత్వ వాటాల అమ్మకం, ఏజెన్సీ వ్యవస్థలో మార్పులు, సంస్థాగత సంస్కరణల పేరిట చర్యలు మొదలు పెట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చర్యలకు వ్యతిరేకంగా పట్టాదారుల సంక్షేమం, దేశహితం కోసం ప్రభుత్వ బీమా రంగ ఉద్యోగులు పోరాడుతున్నారన్నారు. ఐఎంఎఫ్ నిర్దేశిత పెన్షన్ సంస్కరణలు అన్ని రంగాల్లో

మహాసభలో ప్రసంగిస్తున్న కె మోహనరావు

అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం చూడడంతో, ఆయా రంగాల పెన్షనర్ల సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. దేశ వ్యాప్తంగా అన్ని రంగాల పెన్షనర్ల ఐక్య పోరాటానికి కృషి జరుగుతోందన్నారు.

ఉద్యోగ సంఘం నాయకులు జి.కిశోర్‌కుమార్ మాట్లాడుతూ పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని, బీమా ప్రీమియంపై జిఎస్‌టి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బీమారంగ పరిరక్షణకు, పాలసీదారుల ప్రయోజనాలకు ఉద్యమం కొనసాగుతుందని తెలిపారు. ఈ మహాసభలో యూనియన్ నాయకులు కె.ఎస్.మూర్తి, బిహెచ్‌విఎల్.రాధాకృష్ణమూర్తి, జె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ

రాధాకృష్ణమూర్తి

అధ్యక్షులుగా పి.కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా బిహెచ్‌విఎల్.రాధాకృష్ణమూర్తి ఎన్నిక

అనంతరం 30 మందితో నూతన కమిటీ ఏర్పడింది. అధ్యక్షులుగా పి.కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా బిహెచ్‌విఎల్. రాధాకృష్ణమూర్తి, కోశాధికారిగా పి.నాగయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా నలుగురు, సహాయ కార్యదర్శులుగా నలుగురు ఎన్నుకోబడ్డారు.

మాట్లాడుతున్న నారాయణ

తెలుగు రాష్ట్రాల్లోనూ డబుల్ ఇంజన్ సర్కారే

- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్‌తోపాటు, తెలంగాణలోనూ బిజెపి డబుల్ ఇంజిన్ సర్కారే నడుస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. ఎపిలో అధికార ప్రతిపక్షాలు, తెలంగాణాలో బిఆర్‌ఎస్ రెండూ బిజెపికి అనుకూలంగా ఉంటూ దోస్తీ చేస్తున్నాయని అన్నారు. దేశాన్ని రక్షించండి - రాష్ట్రాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం గుంటూరు చేరుకుంది. ఈ సందర్భంగా వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన బహిరంగ సభలో నారాయణ మాట్లాడుతూ 150కి పైగా సీట్లు సాధించి, బలమైన పార్టీగా అవతరించిన వైసిపి విభజన చట్టాన్ని అమలు చేయించుకోవడంలో విఫలమైందన్నారు. బిజెపికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తూనే ఉన్నాయన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సమాఖ్య వ్యవస్థను నాశనం చేస్తోందని, మణిపూర్‌లోనూ బిజెపి ప్రభుత్వమే అధికారంలో ఉన్నా అక్కడి హింసను అరికట్టలేకపోయిందని అన్నారు. 60 వేల మంది సైన్యం ఉన్నా హింస కొనసాగుతోందని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ నాలుగేళ్ల జగన్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమన్నారు. వ్యవసాయ రంగం నిర్వీర్యమైందని, పారిశ్రామికంగానూ, ఇతర అన్ని రంగాల్లోనూ వెనుకబడిపోయిందని విమర్శించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయలేదని, అప్పులతో రాష్ట్రాన్ని దివాళా తీయించారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు.

విమర్శలకు భయపడేది లేదు

- టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

'విమర్శలకు భయపడేది లేదు.. గతంలోనూ టిటిడి చైర్మన్‌గా ఎన్నో గొప్ప సంస్కరణలు తీసుకొచ్చాను... ఇపుడూ అలాగే ముందుకెళతాను' అని టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. 'మూడుతరాల మనిషి భూమన్' పుస్తకావిష్కరణ సభ తిరుపతి ఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్లో మానవ వికాస వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సభలో భూమన్‌ను నిలువెత్తు పూలతో సత్కరించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ తన జీవన గమనాన్ని మార్చిన వారిలో త్రిపురనేని, భూమన్ ముందు వరుసలో ఉంటారన్నారు. తాము విప్లవ రాజకీయాల నుంచి ఉద్భవించిన వారమన్నారు. అందుచేత తాను నాస్తికుడని, క్రైస్తవుడని దురుద్దేశంతో, రాజకీయ ప్రయోజనాలు ఆశిస్తూ మాట్లాడుతున్న వారి మాటలకు భయపడి వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తెలిపారు. టిటిడి చైర్మన్‌గా గతంలోనూ అనేక కార్యక్రమాలను నిర్వహించానని గుర్తు చేశారు. గౌరవ అతిథిగా విచ్చేసిన టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి మాట్లాడుతూ భక్తి విశ్వాసాలు దెబ్బతినేలా టిటిడిపైనా, చైర్మన్‌పైనే వచ్చే విమర్శలను స్థానికులు ఎదుర్కోవాలన్నారు. నాలుగు సంవత్సరాల్లో టిటిడి చేపట్టిన కార్యక్రమాలపై రూపొందించిన వీడియోను సెప్టెంబర్ నెలలో మహతి ఆడిటోరియంలో ప్రదర్శించనున్నట్టు తెలిపారు. విశిష్ట అతిథి అమరరాజా సంస్థల అధినేత గల్లా రామచంద్రనాయుడు, జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, మానవ వికాస వేదిక ప్రతినిధులు సాకం నాగ రాజు, శైలకుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు, పన్నులు తగ్గిస్తాం..!

- ఏలూరు జిల్లా పర్యటనలో లోకేష్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తాము అధికారంలోకి రాగానే విద్యుత్ ఛార్జీలు, జగన్ పెంచేసిన పన్నులు తగ్గిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఏలూరు జిల్లా చింతలపూడి నియోజక వర్గంలో ఆదివారం మూడోరోజు కొనసాగింది. ముసునూరు మండలం వలసపల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్ర చింతలపూడి నియోజకవర్గం లింగపాలెం మండలంలోకి ప్రవేశించింది. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు గజమాలతో లోకేష్‌కు పెద్దఎత్తున స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చారు. లోకేష్‌ను కలిసిన గ్రామస్తులు పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. ముఖ్యంగా చింతలపూడి ప్రాజెక్టు పూర్తి కాకపోవడంతో పంటలు పండించుకోవడానికి సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ జగన్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల గేట్లకు గ్రీజుపెట్టే పరిస్థితి కూడా లేదన్నారు. నాలుగేళ్లలో అన్నమయ్య ప్రాజెక్టు, గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకుపోయాయన్నారు. పంచాయతీ నిధులను

పాదయాత్రకు భారీగా హాజరైన జనం

దారిమళ్లించి గ్రామాలను నిర్వీర్యం చేశారన్నారు. తాము అధికారంలోకి వస్తే ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపి మెరుగైన పాలసీతో ప్రజలకు ఇసుకను అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తామన్నారు. ధర్మాజిగూడెంలో ప్రజలు విద్యుత్ ఛార్జీల భారాలు, నిత్యావసర ధరలు, పన్నులు పెంచేశారని, వచ్చే ఆదాయంతో బతకడం కష్టంగా ఉందంటూ మొరపెట్టు కున్నారు. విద్యుత్ ఛార్జీలు, పన్నులు తగ్గిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రి పీతల సుజాత, బొమ్మాజి అనిల్, మాగంటి బాబు, ఆరిమిల్లి రాధాకృష్ణ, ముళ్లపూడి బాపిరాజు పలువురు నాయకులు ఉన్నారు.

బాధిత దళిత మహిళతో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమాదేవి

దళిత మహిళలపై దాడి అమానుషం

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమాదేవి

ప్రజాశక్తి-దర్శి (ప్రకాశం జిల్లా)

దళిత మహిళలపై పెత్తందారులు దాడి చేయడం అమానుషమని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. ప్రకాశం జిల్లా దర్శి మండలం బొట్లపాలెంలో పెత్తందారుల దాడిలో గాయపడిన దళిత మహిళలు అనూరాధ, మౌనిక కుటుంబాలను ఆదివారం ఐద్వా బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయినా ఇంకా పెత్తందారీతనం, కులవివక్ష కొనసాగుతూనే ఉందన్నారు. దళిత మహిళలపై దాడి ప్రణాళిక ప్రకారమే చేశారని, వారిని చిత్ర హింసలకు గురిచేశారని తెలిపారు. ఒంటిపై పెట్రోలు పోసి నిప్పంటించేందుకు ప్రయత్నించారని తెలిపారు. ఈ ఘటనపై ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రకాశం జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, జిల్లా అధ్యక్షులు సయ్యద్ షమ్మీ, డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కెవి. పిచ్చయ్య, దళిత నాయకులు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను మోసం చేశారు

- టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వివిధ ప్రభుత్వ శాఖల్లోని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మించి మోసం చేశారని టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. ఎన్నికలకు ముందు అందర్నీ రెగ్యులరైజ్ చేస్తామని అధికారంలోకి వచ్చాక మాట తప్పారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2016 జూన్ నాటికి ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన వారిని మాత్రమే రెగ్యులరైజ్ చేస్తామనడం మోసం కాదా? అని ప్రశ్నించారు.

పెద్దిరెడ్డి జీవితమంతా దోపిడీలు, అబద్ధాలే : నక్కా ఆనంద్‌బాబు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జీవితమంతా దోపిడీలు, అబద్ధాలే అని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్‌బాబు విమర్శించారు. మంత్రి పెద్దిరెడ్డికి ఆనంద్‌బాబు బహిరంగ లేఖ రాశారు. టిడిపి అధినేత చంద్రబాబు ఇసుక ప్రెజెంటేషన్‌కు సమాధానం చెప్పకుండా ఎదురుదాడి చేయడం మంత్రిగా తగునా అని ప్రశ్నించారు. చంద్రబాబు ఇంటి పక్కన ఇసుక దోపిడీ జరిగిందన్న ఆరోపణ పచ్చి అబద్ధం కాదా? అని ప్రశ్నించారు. వైసిపి అధికారంలోకి రాగానే నిబంధనల ప్రకారమే డ్రెడ్జింగ్ చేశారని, ఎన్‌జిటిలో అఫిడవిట్ వేసి జరిమానా రద్దు చేసుకున్నది నిజం అని తెలిపారు.

వాన్‌పిక్ భూముల్లో నిమ్మగడ్డ పర్యటన పట్ల నిరసన

ప్రజాశక్తి - వేటపాలెం (బాపట్ల జిల్లా)

బాపట్ల జిల్లాలో వాన్‌పిక్ భూములను వాన్‌పిక్ నిర్మాణ కాంట్రాక్టర్ నిమ్మగడ్డ ప్రసాద్ రహస్యంగా పరిశీలించడాన్ని నిరసిస్తూ వేటపాలెం గడియార స్తంభం సెంటర్‌లో వాన్‌పిక్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో నల్ల దుస్తులతో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వాన్‌పిక్ వ్యతిరేక పోరాట కమిటీ కార్యదర్శి పి.కొండయ్య, మోటుపల్లి పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ పండు రాజు శంకర్ మాట్లాడుతూ...



నల్లదుస్తులు ధరించి నిరసన తెలుపుతున్న నాయకులు

రైతులకు వాన్‌పిక్ ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానమూ నెరవేరలేదని తెలిపారు. భూములు ఇచ్చిన వారికి ఇంటికో ఉద్యోగం, నివాస స్థలం, 12 ఫిల్లర్ల ఇల్లు, పాడి గేదెలు అంటూ అరిచేతిలో వైకుంఠం చూపారన్నారు. తక్కువ ధరకే రైతుల భూములు కాజేశారని విమర్శించారు. పదిహేనేళ్లుగా అడ్రస్ లేని వాన్‌పిక్ ప్రతినిధులు ఇప్పుడు వేటపాలెం మండలం పుల్లారి పాలెం, కటారిపాలెం గ్రామాల్లోని భూముల్లో గుట్టుచప్పుడు కాకుండా తిరుగుతున్నారన్నారు. రైతులు సాగు చేసుకుంటున్న భూములకు సాగునీరు, విద్యుత్ ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో వాన్‌పిక్ చైర్మన్ నిమ్మగడ్డ ప్రసాద్ రైతుల భూముల్లో తిరగడాన్ని తప్పుబట్టారు. వాన్‌పిక్ కోసం రైతుల నుంచి సేకరించిన భూములను తిరిగి రైతులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసనలో సిపిఎం నాయకులు మచ్చ అయ్యప్ప రెడ్డి, ఆంజనేయులు, శివరాడియన్ సత్తి వేలు, హేతువాద నాయకులు పల్లపోలు నాగ మనోహర్ లోహియా పాల్గొన్నారు.

కాన్కాస్ట్ స్టీల్ మరియు పవర్ లిమిటెడ్ (లిక్విడేషన్ లో) ఇ-వేలం
ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంకరప్టసీ కోడ్ 2016 క్రింద అసెట్స్ అమ్మకం

గౌరవనీయమైన నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, కోల్‌కతా బెంచ్ 26 సెప్టెంబర్, 2018 నాటి ఉత్తర్వు ద్వారా నియమించబడిన లిక్విడేటర్ ద్వారా ఏర్పడిన లిక్విడేటర్ ఏర్పాటు చేసిన లిక్విడేషన్ ఎస్టేట్‌లో భాగమైన కాన్‌కాస్ట్ స్టీల్ మరియు పవర్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో) యాజమాన్యంలోని ఆస్తులు మరియు ఆస్తుల విక్రయం. ఆసక్తిగల దరఖాస్తుదారులు కార్పొరేట్ రుణగ్రహీత యొక్క వెబ్‌సైట్ http://concastispat.com/nclt.html మరియు ఇ- వేలం వెబ్‌సైట్ HTTPS://NCLTAUCTION.AUCTIONTIGER.NET లో అప్‌లోడ్ చేసిన వివరణాత్మక ఇఓఐ ప్రాసెస్ డాక్యుమెంట్‌ను చూడవచ్చు.
ఇ-వేలం ప్లాట్‌ఫారం https://ncltauction.auctiontiger.net (ప్రతి 15 నిమిషముల అపరిమిత పొడిగింపులతో) ద్వారా వేలం విక్రయం జరుగుతుంది.

అసెట్స్ లాట్	అమ్మకం విధానం	తనిఖీ తేది	వేలం తేది మరియు సమయం	ఇఎమ్‌డి మొత్తం మరియు డెడ్‌లైన్ సమర్పణ	రిజర్వు ధర
మెట్ కాక్ (శ్రీకాకుళం వద్ద అందుబాటులో ఉంది)	స్టాండలోన్ బేసిస్	18 సెప్టెంబర్, 2023 ముందు	22 సెప్టెంబర్, 2023, 11.01 నుండి 17.00	ఐఎన్ఆర్ 7.36 లక్షలు 19 సెప్టెంబర్, 2023న లేదా ముందు	ఐఎన్ఆర్ 73.60 లక్షలు.

ఇంకా, ఐబిబిఐ (లిక్విడేషన్ ప్రాసెస్) రెగ్యులేషన్ 2016 యొక్క నిబంధన ప్రకారం సవరించబడిన అన్ని ఆసక్తిగల బిడ్డర్లు ఇ-వేలం ప్రక్రియ సమాచార పత్రంలో అందించిన విధంగా 11 సెప్టెంబర్, 2023న లేదా అంతకు ముందు అవసరమైన అర్హత పత్రాలతో పాటు ఆసక్తి వ్యక్తీకరణను సమర్పించాలి.
ఇ-వేలానికి సంబంధించి ఏదైనా సందేహం కోసం, సంప్రదించండి: శ్రీ సప్తర్షి బైద్య / శ్రీ నవనిత్ కుమార్‌ని +91 98360 70992/79035 75095. Email: LQ.Concast@in.gt.com.
వేలం కోసం పబ్లిక్ నోటీసు http://concastispat.com/nclt.html మరియు ఇ వేలం వెబ్‌సైట్ https://ncltauction.auctiontiger.net. లో కూడా ప్రచురించబడుతుందని దయచేసి గమనించండి.

క్షితిజ్ చౌచారియ
కాన్‌కాస్ట్ స్టీల్ మరియు పవర్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో)
ఐబిబిఐ రిజి.నం.IBBI/IPA-001/IP-P00358/2017-18/10616
ఎఎఫ్ఎ 24 జనవరి, 2024 వరకు చెల్లుతుంది
రిజిస్టర్డ్ చిరునామా : కేరాఫ్. బి.యౌచారియ అండ్ కో, 8ఎ మరియు బి, సత్యం టవర్స్, 3 అలిపోర్ రోడ్డు, కోల్కత్తా-700027
ఇ మెయిల్ : Kshitiz@bccoindia.com

ప్రదేశం : కోల్కత్తా
తేది : 28 అగస్ట్ 2023

టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
TATA
సంప్రదించు చిరునామా: 11వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్సుల బిజినెస్ పార్కు, గణపత్రావ్ కదం మార్గ్, లోవర్ ప్యారెల్, ముంబయి 400013 సంప్రదించాల్సిన నెం.(022) 61827414, (002) 61827375.

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)
(సెక్యూరిటీ ఇంటెరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8(1) ప్రకారం)

ఏదైతే, క్రింది సంతకందారు ది **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని,దిగువ చూపినట్లుగా తేదీన డిమాండ్ నోటీసు జారీచేసి, రుణగ్రహీతలను సదరు నోటీసు తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది. రుణగ్రహీత, మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా ప్రత్యేకించి రుణగ్రహీతను మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరురూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనంలోకి తీసుకున్నారు. ప్రత్యేకించి రుణగ్రహీత, మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారికి దిగువ పేర్కొన్న మొత్తాలను మరియు డిమాండ్ నోటీసు తేది నుండి దానిపై వడ్డీ మరియు ఫైనల్ వడ్డీ, చార్జీలు, ఖర్చులు మొ॥వాటిని చెల్లించుటకులోబడి ఉంటుంది.
సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్(8) యొక్క నియమాలపై రుణగ్రహీత శ్రద్ధ వహించవలసిందిగా కోరబడుచున్నది.

రుణ ఖాతా సంఖ్య	బాధ్యులు/చట్టబద్ధ వారసులు/ చట్టబద్ధ ప్రతినిధుల పేరు	మొత్తం & డిమాండ్ నోటీసు తేది	స్వాధీనతా తేది
9793067	శ్రీ.పోతురెడ్డి మాస్ (రుణగ్రహీత) శ్రీ.బుల్లెమ్మ మున్నంగి (సహ-రుణగ్రహీత)	07.12.2022 నాటికి మొత్తం రూ॥98,61,026/- (తొంభై ఎనిమిది లక్షల అరవై ఒక వేల ఇరవై ఆరు రూపాయలు మాత్రమే)25 అగస్ట్, 2023	25th August, 2023

స్థిరాస్తి షెడ్యూల్ : 1వ అంశం : గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ రిజిస్ట్రీ, గుంటూరు మున్సిపాలిటీ, అంకిరెడ్డిపాలెం గ్రామం వద్ద ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ సైట్ విస్తీర్ణం 350 చ.గ.లు. లేదా 292.63 చ.మీ.లు., ప్లాట్ నం.6, సరిహద్దు నం.14/ఎ, 14/బి మరియు హద్దులు : తూర్పు: 28 అ.లు. వెడల్పు రోడ్డు 52-6 అ.లు., దక్షిణం: కన్నెదర సుబ్బారావు ప్లాట్ నం.7 60 అ.లు., పడమర: ఇతరుల ద్వారా అమ్మబడిన గదె అంకిరెడ్డి 52-6 అ.లు., ఉత్తరం: శివారెడ్డి ఆస్తి 60 అ.లు.
2వ అంశం: గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ రిజిస్ట్రీ, గుంటూరు మున్సిపాలిటీ, అంకిరెడ్డిపాలెం గ్రామం వద్ద ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ సైట్ విస్తీర్ణం 183-34 చ.గ.లు. లేదా 153-29 చ.మీ.లు., ప్లాట్ నం.2, సరిహద్దు నం.14/ఎ, 14/బి, ఉన్న హద్దులు : తూర్పు: మెట్టు చిన్న మల్లారెడ్డి ఆస్తి 30 అ.లు., దక్షిణం: మున్నంగి పోతి రెడ్డి ప్లాట్ నం.3 55 అ.లు., పడమర: 28 అ.లు. వెడల్పు రోడ్డు 30 అ.లు., ఉత్తరం: యరం శివారెడ్డి ప్లాట్ నం.2 సైట్ 55 అ.లు.
3వ అంశం : గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ రిజిస్ట్రీ, గుంటూరు మున్సిపాలిటీ, అంకిరెడ్డిపాలెం గ్రామం వద్ద ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ సైట్ విస్తీర్ణం 220 చ.గ.లు. లేదా 183-94 చ.మీ.లు. ప్లాట్ నం.3, సరిహద్దు నం.14/ఎ, 14/బి, ఉన్న హద్దులు : తూర్పు: మెట్టు చిన్న మల్లారెడ్డి ఆస్తి 36 అ.లు., దక్షిణం: పెరుమాళ్ల రాంబాబు ప్లాట్ నం.4 సైట్ 55 అ.లు., పడమర: 28 అ.లు. వెడల్పు రోడ్డు 36 అ.లు., ఉత్తరం : మున్నంగి బుల్లెమ్మ ప్లాట్ నం.2 సైట్ 55 అ.లు.
4వ అంశం : గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ రిజిస్ట్రీ, గుంటూరు మున్సిపాలిటీ, అంకిరెడ్డిపాలెం గ్రామం వద్ద ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ సైట్ విస్తీర్ణం 222 చ.గ.లు. లేదా 185-61 చ.మీ.లు. ప్లాట్ నం.5, సరిహద్దు నం.14/ఎ, 14/బి, ఉన్న హద్దులు : తూర్పు: మెట్టు చిన్న మల్లారెడ్డి ఆస్తి 36 అ.లు., దక్షిణం: కుందుల రోడ్డు మరియు ప్లాట్ నం.5ఎ సైట్ 55-6 అ.లు., పడమర: 28 అ.లు. వెడల్పు రోడ్డు 36 అ.లు., ఉత్తరం: పెరుమాళ్ల రాంబాబు ప్లాట్ నం.4 సైట్ 55-6 అ.లు.
5వ అంశం : గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ రిజిస్ట్రీ, గుంటూరు మున్సిపాలిటీ, అంకిరెడ్డిపాలెం వద్ద ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ సైట్ విస్తీర్ణం 240 చ.గ.లు. లేదా 200-66 చ.మీ.లు., ప్లాట్ నం.8, సరిహద్దు నం.14/ఎ, 14/బి, ఉన్న హద్దులు : తూర్పు: 28 అ.లు. వెడల్పు రోడ్డు 36 అ.లు., దక్షిణం: డి.వరప్రసాద్ ప్లాట్ నం.9 సైట్ 60 అ.లు., పడమర: ఇతరుల ద్వారా విక్రయించబడిన గదె అంకిరెడ్డి 36 అ.లు., ఉత్తరం: కె. సుబ్బారావు ప్లాట్ నం.7 సైట్ 60 అ.లు.

ప్రదేశం: గుంటూరు
తేది: 27 అగస్ట్, 2023
సం/- అధీకృత అధికారి
టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్., తరపున

రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్.

శాఖా కార్యాలయం: రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, 3వ అంతస్తు, ధృవ్ ఆర్కేడ్, బేరింగ్ నం.6-3-248/బి/1, నవీన్ నగర్, రోడ్డు నం.1, బంజారా హిల్స్, హైదరాబాద్-500034
కార్పోరేట్ మరియు నమోదిత కార్యాలయం :రూబీ టవర్స్, 11వ అంతస్తు, నారత్ వెస్ట్ వింగ్, ప్లాట్ నం.29, జె.కె.సావంత్ మార్గ్, దాదర్, ముంబై-400028.

అమ్మకం కం వేలం నోటీసు

ఏదైతే, తేది 7 జూన్, 2019 స్ట్రెస్డ్ రిజల్యూషన్ కొరకు ప్రుడెన్షియల్ ఫ్రేమ్ వర్క్ ఆర్‌బిఐ సర్క్యులర్ నం.ఆర్‌బి/2018-19/203, డిబిఆర్.నం.బిపి.బిసి.45/21.04.048/2018-19 యొక్క నిబంధనలలో రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్. (ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్) దీని రుణదాతల ద్వారా ఆమోదించబడిన రిజల్యూషన్ ప్లాన్ ప్రకారం తేది 3 మార్చి, 2023న గౌరవనీయమైన భారత సుప్రీం కోర్ట్ ఆర్డర్ మరియు 25 మార్చి, 2023న షేర్ హోల్డర్స్ ద్వారా ప్రత్యేక రిజల్యూషన్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌సిఎఫ్‌ఎల్) కు కన్సర్న్ ప్రాతిపాదికన స్లంప్ సేల్ ద్వారా వ్యాపారాన్ని బదిలీ చేయడానికి ఆర్‌సిఎఫ్‌ఎల్‌ఎల్ ఒప్పందం కుదుర్చుకుంది. మరియు ఏదైతే, ఆర్‌సిఎఫ్‌ఎల్‌కు రుణగ్రహీత కలిగిన/కలిగి ఉన్న లోన్ ఎకౌంటు(లు)కు సంబంధించిన అన్నీ హక్కులు మరియు అప్పులు కూడా బదిలీ చేయబడినవి. ఆర్‌సిఎఫ్‌ఎల్ యొక్క వడ్డీ మరియు ఖర్చులతో పాటు క్రింద పేర్కొన్న సెక్యూరిటీ డెట్స్ రికవరీ కొరకు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 నిబంధనల క్రింద రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌సిఎఫ్‌ఎల్) యొక్క అధీకృత అధికారి (ఎఓ) అయిన దిగువసంతకందారుడు క్రింద పేర్కొన్న రుణగ్రహీత యొక్క దిగువ పేర్కొన్న ఆస్తుల కొనుగోలు కొరకు టెండర్లు/కొటేషన్లను ఆహ్వానిస్తున్నారు. ఆస్తులను "ఎక్కడ ఉంది" మరియు "ఆధారం ఏమైనా ఉంది" మరియు ఆధారం లేకుండా విక్రయించాలని ప్రతిపాదించబడింది.

రుణగ్రహీత/సహ రుణగ్రహీత/హామీదారుల పేరు మరియు చిరునామా	విక్రయానికి ఉన్న ఆస్తి రికవరీ కొరకు బకాయి	రిజర్వు ధర (ఆర్‌పి), ధరావత్తు డిపాజిట్ మొత్తం (ఇఎమ్‌డి), తనఖీ తేది	వేలం తేది, సమయం మరియు వేదిక/కొటేషన్స్/బిడ్స్ ప్రారంభం
1. పోతురాజు గజలక్ష్మి, చిరునామా : డో.నం.12-8-44, వడ్డూరువారి వీధి, కొత్తపేట, గుంటూరు, గుంటూరు-522001. 2. వెంకటేశ్వరరావు పోతురాజు, 3. జిఎల్ ఇన్‌ఫ్రా, చిరునామా : డో.నం.8-17-1, డో.నం.397/బి, మూల్యాంకనం నం.51158, గుంటూరు సిటీ, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, గుంటూరు-522001.	21 అగస్ట్, 2023 నాటికి రూ.2,11,14,277/- (రెండు కోట్ల పదకొండు లక్షల పద్నాలుగు వేల రెండు వందల డెబ్బై ఏడు రూపాయలు మాత్రమే)	రిజర్వు ధర : రూ.4,10,00,000/- (నాలుగు కోట్ల పది లక్షల రూపాయలు మాత్రమే) ధరావత్తు డిపాజిట్ మొత్తం : రూ.41,00,000/- తనిఖీ తేది : 03 ఆర్డర్ 2023, ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. వరకు	05 అక్టోబర్ ఉ.11.00 గం. రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, 3వ అంతస్తు, ధృవ్ ఆర్కెడ్, బేరింగ్ నం.6-3-248/బి/1, నవీన్ నగర్, రోడ్డు నం.1, బంజారా హిల్స్, హైదరాబాద్-500034.

ఆస్తి/సెక్యూరిటీ ఇంట్రెస్ట్ వివరాలు : గుంటూరు-522001, ఎపి, గుంటూరు జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, గుంటూరు సిటీ, మూల్యాంకనం నం.51158, సరిహద్దు నం.397/బి, డో.నం.8-17-1 వద్ద ఉన్న మొత్తం 1) పోతురాజు గజలక్ష్మి, 2). వెంకటేశ్వరరావు పోతురాజు, 3) జిఎల్ ఇన్‌ఫ్రా, క్రింది విధమైన హద్దులు:
అంశం నం.1 : గుంటూరు జిల్లా, గుంటూరు డిఆర్‌ఓ మరియు గుంటూరు ఎస్ఆర్‌ఓ, గుంటూరు టౌన్ ఏరియా, ప్రస్తుతం పాత గుంటూరు పరిధిలోని గుంటూరు గ్రామం భాగం, మంగల్‌దాస్ నగర్ వద్ద ఉన్న డెమార్కెషన్ నం.397/బి క్రింద రిజిస్ట్రేషన్ సేల్ డీడ్ వైడ్ డాక్.నం.8571/1984 ద్వారా శ్రీ పోతురాజు వెంకటేశ్వరరావు, తండ్రి. సుబ్బారావు కు చెందిన 204.0 చ.గ.లు., ఉన్న హద్దులు : తూర్పు: దౌడ వెంకటేశ్వర్లు కు చెందిన స్థలం, దక్షిణం: 30.0 అ.లు. వెడల్పు రోడ్డు, పడమర: బోడపాటి అలివేలమ్మకు చెందిన స్థలం, ఉత్తరం : పోతురాజు వీరాస్వామి మరియు ఇతరులకు చెందిన స్థలం.
అంశం నం.2 : గుంటూరు గ్రామం, మంగల్‌దాస్ నగర్ వద్ద ఉన్న డెమార్కెషన్ నం.397/బి క్రింద తేది : 14.09.2007న రిజిస్ట్రేషన్ భాగం డీడ్ వైడ్ దీని డాక్.నం.12663/2007 ద్వారా శ్రీ పోతురాజు వెంకటేశ్వరరావు, తండ్రి. సుబ్బారావు కు చెందిన 200.0 చ.గ.లు. బయట 400 చ.గ.లు., దీని పడమర వైపు ఉన్న హద్దులు :
తూర్పు: పోతురాజు గజలక్ష్మికి చెందిన స్థలం (అంశం నం.3), దక్షిణం: అల్ల కుటుంబరావు మరియు ఇతరులకు చెందిన స్థలం, పడమర: పోతురాజు అమ్మయ్య మరియు [illegible]
అంశం నం.3 : [illegible]
అంశం నం.4 : [illegible]

1. సాయిబాబా నట్టు, చిరునామా : ప్లాట్ నం.8, 45 [illegible]	22 ఆగస్ట్, 2023 నాటికి రూ.50,39,103.77/- [illegible]	రిజర్వు ధర : రూ.42,00,000/- [illegible] ధరావత్తు డిపాజిట్ మొత్తం : రూ.4,20,000/- తనిఖీ తేది : 03 అక్టోబర్ 2023, ఉ.11.00 గం. నుండి సా.5.00 గం. వరకు	05 అక్టోబర్ ఉ.12.00 గం., రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, 3వ అంతస్తు, ధృవ్ ఆర్కేడ్, బేరింగ్ నం.6-3-248/బి/1, నవీన్ నగర్, రోడ్డు నం.1, బంజారా హిల్స్, హైదరాబాద్-500034.

[illegible]

షరతులు మరియు నిబంధనలు : [illegible]

ప్రదేశం: విజయవాడ, గుంటూరు
తేది : 28.08.2023
(అధీకృత అధికారి)
రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti
అక్షరం
4 | విజయవాడ
సోమవారం 28 ఆగస్టు 2023

కవిత్వానికి కూడా సైన్సు వలె
కావాలి రీసెర్చీ, ఎక్స్‌పర్‌మెంటూ.
సమకాలీన జీవితమే సత్కవితా
వస్తువు.

\- శ్రీశ్రీ

పిడికిళ్లు మొలిపించే పాట!

ఏ మువ్వ మోగినా
యాది కొచ్చింది నువ్వే
ఏ కష్టజీవి చేతికర్ర కంట బడినా
నీ చేతులే మతిల బడుతున్నాయి
నువ్వు కప్పుకున్న గొంగడిలో
మబ్బుపట్టిన ఆకాశం అగుపిస్తే
కురుస్తున్న జడివానలో
నీ గానమే వినిపిస్తుంది
...
నాట్లేస్తూ వానలో నానుతున్న
పనిదేవతల్ని పలకరిస్తే
అందరిలో అమ్మ లచ్చుమమ్మే
అవుపడతంది
ఏ చెల్లెమ్మ పాదమ్మీద
పుట్టుమచ్చ కంటబడినా
నీ పాట ముచ్చట్లే
ముసురుకుంటాయి
...
నీ జునపాల జుట్టు
కనిపించినప్పుడల్లా
ధిక్కార గునపాలే అనిపిస్తాయి
ఇంతకీ నువ్వు ఎక్కడికెళ్లినావన్నా
మా గొంతులోనే గెంతుతున్నా వన్నా

నీ పాటలు వింటూ
పరకలు మేస్తున్న మేకల కొమ్ములకు
కత్తులు పూస్తున్నట్టే వుంటుంది
...
నాడు నేడు ఏనాడూ
నువ్వు పాటై పోటెత్తుతూనే వుంటావు
బడుగులోల అడుగుల్లో నువ్వు
అడుగై అగుపడుతుంటావు
నీ పాటల తోటలో ఏరుకోవాలిగానీ
ఏ పాటైనా నీటిని నిప్పుగా రాజేసి
అసమ సమాజమ్మీద
అగ్గిపిడుగై రాలగలదు
...
వెల్లినట్టే వెళ్ళావు
నీ కాయాన్ని కాల్చుకున్నావుగానీ
రాల్చిన పాటల్ని
మాలో రగిలించుతున్నావు
మువ్వల కర్రతో మురిపించి
ఎన్నుకు ఏలాడిన డప్పు
దరువుల చప్పుడై
పాదాలను కదిలిస్తున్నావు
పిడికిళ్లను మొలిపిస్తున్నావు!

\- చింతా అప్పల నాయుడు
9441714185

నిజ జీవిత చిత్రం

అటు సూర్యుడు లేక
ఇటు వర్షమూ రాక
ముసురుకుంది ఆకాశం
మనిషి మనసులో దాగిన
ఆలోచనలు ఆవేశాలు
ఒక రూపం ధరించేలోపు
బయటకు రానీయని
అవాంతరాలూ అంతే మరి
కదలనీయని నియంత్రణతో
మనిషి మనసు రాసుకునే
అక్షరాలని కలం దాటకుండా
దాటినా ఒక నిర్దిష్ట రూపాన్ని
ధరించనీకుండా దరి చేరకుండా
చేసే విచిత్ర బాహ్య చిత్రం
అంతరాంతరాల్లోని బాధని
దయతో ఎందుకు చూస్తుంది
అంతరాయం కలిగించడమే కద
తన నియమిత అర్థం పరమార్థం
అందుకే ఎదురేగి ఎదిరించి
తన రూపాన్ని తానే పొందాలని
చేసే ప్రయత్నమే నిజజీవిత చిత్రం!

\- జంధ్యాల రఘుబాబు
98497 53298



కలిసుందాం!

నేస్తమా
నిన్నా మొన్నా ప్రపంచమంతా
నిండు మానవతా సంద్రమై ఉన్నప్పుడు
నువ్వూ నేనూ దోస్తులమే
మెరుస్తూ వెలుగులు పంచే శక్తులమే
నేడూ రేపూ ప్రస్తుతమంతా
మార్కెట్ ఎడారిగా మారిన వేళ
నువ్వూ నేనూ వస్తువులం
మానవులం.. ఇసుక రేణువులం
కాస్తా తలెత్తి చూస్తే తెలిసొస్తుంది
దుస్తులకే కాదు మన మస్తిష్కాలకూ
ధరల పట్టీలు వేలాడుతున్నాయి
ఇష్టాయిష్టాల సమస్త భావాలపై
సమూహ మైకపు ప్రభావాలున్నాయి
నిన్నూ నన్నూ వేరుగా చూపే, దూరం పెంచే
అగాధాలున్నాయి.. ఆధునిక వాదాలున్నాయి
సరేలే నేస్తం, వాస్తవాన్ని చూద్దాం
నిస్తేజం వదిలేద్దాం
ఎదురు గాలిని ఒడిసి పడితే
ఇసుక రేణువులే ఎగసిపడితే
బేహారి కళ్ళు మసకబారవా?
బజారు వ్యూహాలు బేజారు కావా?!

\- డా. డి.వి.జి.శంకర రావు, మాజీ ఎంపీ,
94408 36931

తెలుగు భాషా సేవలో ఆ ఇద్దరు

ఆ ఇద్దరిలో ఒకరు గిడుగు రామ్మూర్తి పంతులు, మరొకరు గురజాడ వేంకట అప్పారావు. ఒకరు శ్రీకాకుళానికి 20 మైళ్ల దూరంలో ఉన్న పర్వతాలపేటలో ఆగస్టు 29, 1863లో జన్మిస్తే, మరొకరు విశాఖ జిల్లా, యలమంచిలికి దగ్గరలో ఉన్న రాయవరంలో సెప్టెంబరు 21, 1862లో జన్మించారు. వీరిద్దరూ విజయనగరంలోని మహారాజావారి ఉన్నత పాఠశాలలో సహపాఠులై ఆంగ్లం, సంస్కృతం, చరిత్ర పట్ల అమితమైన శ్రద్ధ చూపేవారు. వృద్ధిలోకి వస్తారనుకున్న పిల్లలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులైన చంద్రశేఖరశాస్త్రి ఇంటిదగ్గర పాఠాలు చెప్పేవారు. అక్కడా వీరిద్దరూ సహాధ్యాయులయ్యారు. అప్పటి నుంచి వీరు ఒకరికొకరు మిత్రులు, సన్నిహితులు, ఆప్తులయ్యారు. తరువాత ఒకరు పర్లాఖిమిడి మహారాజా కళాశాలలో, మరొకరు విజయనగరం మహారాజా కళాశాలలలో ఉపన్యాసకులుగా ప్రసిద్ధులయ్యారు.



ఏ జాతి సంస్కృతిలోనైనా ఆహారం తరువాత కీలకమైన పాత్ర పోషించేది భాష. మానవ సమూహాలు తమ అనుభవాలను, కష్టసుఖాలను పంచుకోవడానికి భాషను సృష్టించుకుంటాయి. మనిషికీ మనిషికీ మధ్య సజీవ సంబంధాలు నెలకొల్పే వాహిక భాష. అటువంటి భాష మనిషికీ మనిషికీ మధ్య గుదిబండగా నిలిచిన వైనాన్ని ఇద్దరూ స్పష్టంగా దర్శించారు. ఈ దేశవాసుల వాడుకలోలేని భాషలో భారతీయ ప్రాచీన సాహిత్యమంతా వచ్చింది. అదే సంస్కృత భాష.

తెలుగు భాష లిఖితరూపంలో మనకు దొరికిన తొలినాళ్లలో అది ఆనాటికి ప్రజల వాడుకలో ఉన్నట్లు శాసనాల్లోని సరళ వాక్యాల ద్వారా తెలుస్తుంది. కాలక్రమంలో శాసనభాషలో రెండు రూపాలు వెలిసాయి. ఒకటేమో చిన్నచిన్న మాటలతో సూటిగా రాసిన భాష. చాలా దాన శాసనాల్లో ఈ భాషారూపం కనిపిస్తుంది, రాజులు, సేనాపతుల విజయవార్తలను ప్రకటించే శాసనాల్లో భాష క్రమంగా కఠినమై, సంస్కృత భూయిష్టమై ప్రజావ్యవహార భాషకు దూరం కావడం మొదలయింది. ఈ స్థితి క్రీస్తు శకం 8వ శతాబ్దం నుంచి క్రమ పరిణామం చెంది చివరకు కావ్యభాష అనే కృత్రిమ రూపాన్ని మనకు ప్రసాదించింది.

నన్నయకు 200 ఏళ్ల ముందే 'కొరవ' శాసనం ద్వారా ఈ కృత్రిమ కావ్య భాష వచనంలో కూడా స్థానం సంపాదించు కున్నట్లు మనకర్థమవుతుంది. నన్నయ నాటికి ఈ రూపం సంపూర్ణంగా నిలదొక్కుకుంది. తరువాత వచ్చిన ప్రబంధ సాహితీకర్తలందరూ రూపంలోను, సారంలోను నన్నయను అనుసరించినవారే. 1565లో తళ్లికోట యుద్ధంలో విజయనగరం సామ్రాజ్యం కుప్పకూలిపోయాక ఆంధ్రసాహిత్యంలో పొద్దుగుంకి చీకటిపడింది. మూడు శతాబ్దాల అనంతరం గురజాడతో మళ్లీ తూర్పు భళ్లున తెల్లవారింది.

సందర్భం

గురజాడ తరువాత వాడుకభాషలో కథా సాహిత్యాన్ని అద్భుతంగా నిర్వహించిన శ్రీపాద ఈ సందర్భంలో గురజాడనుద్దేశించి 'భాష ఎంత శృంఖలాబద్ధమైపోవాలో, అంత శృంఖలాబద్ధమై పోయాకా, సాహిత్యం ఎంతగా దిగజారిపోవాలో, అంతగా దిగజారిపోయాక, భవిష్యత్తు ఎంతగా అంధకారమై పోవాలో అంతగా అంధకార బంధురమైపోయాక పుట్టుకొచ్చాడీ మహాకవి' అన్న మాటలను బట్టి ఇరవయ్యో శతాబ్ది ఆరంభానికి తెలుగు భాషా సాహిత్యాల స్వరూపమెట్లా ఉందో మనకు స్పష్టమౌతుంది.

గిడుగు పిడుగే, ప్రజాభాషకు సాహిత్యంలో స్థానం ఉండాలని, అసలే అత్యధిక సంఖ్యాకులు నిరక్షర కుక్షులుగా ఉన్న సమాజంలో ప్రాచీన రూపాలను, సంస్కృతభాషా మర్యాదలనూ చొప్పించి కృత్రిమంగా నిర్మించిన భాషకు బహుముఖమైన ఆధునిక సారస్వతంలో స్థానం లేదని వాదించిన మొట్టమొదటి భాషా శాస్త్రవేత్త. సమాజంలో భాషా విషయకంగా వచ్చిన, వస్తున్న సిద్ధాంతాలనూ, ఆచరణలనూ గుర్తించిన తొలి తెలుగు భాషా శాస్త్రవేత్త గిడుగు. ఈ సందర్భంలో భారతీయ భాషల గురించి ప్రపంచ భాషా శాస్త్రవేత్తల అభిప్రాయాలను ఇక్కడ గమనించాల్సిన అవసరముంది.

"The Vernacular has been split into two sections. The tongue which is understanded of the people and the literary dialect known only through the press, which is not intelligible to those who donot know Sanskrit. Literature has thus being divorced from the grate masses of the populations and also to the literary classes" (GREARSON)

'భారతీయ భాషలకు గమనార్హమైన ఒక ప్రత్యేక లక్షణముంది. వీటిలో రచనలు వెలువడ్డం ప్రారంభం కాగానే, భాషా శైలులు ప్రజాజీవితం నుంచి వేరుపడి తన స్వంత వ్యాకరణమూ, పదజాలమూ ఉన్న ఒక గ్రాంథిక భాషగా రూపొందే ధోరణిని అలవర్చుకుంటుంది.' (కాడ్వెల్, ద్రావిడ భాషల తులనాత్మక వ్యాకరణం).

'దక్షిణ భారతదేశ భాషలలో ప్రతీ ఒక్కదానికి కవిత్వభాష, వ్యావహారిక భాష ఉన్నాయి. వీటిమధ్య శేగ్జన్ భాషకూ, ఇంగ్లీషు భాషకు మధ్య ఉన్నంత తేడా ఉంది. (సి.పి.బ్రౌన్, తెలుగు, ఇంగ్లీషు, నిఘంటు పీఠిక).

భాషకు సంబంధించి తన ఆలోచనతో ఏకరూపత కలిగిన ఈ అభిప్రాయాలన్నీ గిడుగును వాడుకభాషా ఉద్యమానికి పురికొల్పడమే కాకుండా ఎంతో విశ్వాసాన్ని, ధైర్యాన్ని కల్పించాయి. గిడుగు సిద్ధాంత ప్రవక్త. వాద వివాదాల సందర్భంగా పండితులనుద్దేశించి రాసిన భాష, ఖండన గ్రంథాల్లో రాసిన భాష సహజంగా క్లిష్టంగానే ఉండేది.

ఇక గురజాడ విషయానికి వస్తే ఆయన తన పరిశీలనా, అధ్యయనాల ద్వారా వాడుక భాషపై సాహిత్య భాష (గ్రాంథిక భాష) ఆధిపత్య, ప్రభావాలకు గల మూలాలను గ్రహించినట్లుగా వివిధ సందర్భాల్లో ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాల ద్వారా మనకు స్పష్టంగా అర్థమౌతుంది. 'సంకుచిత, సామాజిక, రాజకీయ సాహిత్యాదర్శాలది పైచేయిగా ఉన్న సామాజిక పరిస్థితుల వలన కావ్యభాష ఉత్పన్నమయింది. విశాల ప్రజానీకం, ప్రభువర్గం కోసమే బతికేది, శ్రమించేది, ఆనాడు శూద్రుడు చదువుకోవడమే ఒక నేరం'. 'విశాల ప్రజానీకం చదువుకోవడం, పూర్వాచార సాంప్రదాయంలో భాగం కాదు. నాడు జ్ఞానార్జన, సాహిత్యం, బ్రాహ్మణుని గుత్త సొమ్ము. అతని దృష్టిలో సంస్కృతం పెట్టిన ఒరవడి పవిత్రమైనది, మీరరానిది. తెలుగు సాహిత్యం సంస్కృత ప్రభావంలో అంకురించింది. సంస్కృత సాహిత్యం క్షీణదశలో ఉన్న కాలంలో తెలుగు సాహిత్య సృష్టి ప్రారంభమైనందువల్ల క్షీణదశ లక్షణాలైన భాషా, కళా సాంప్రదాయాలు తెలుగు సాహిత్యంలో పాతుకుపోయాయి'. 'ఈ సందర్భంలో తెలుగు సాహిత్యానికి సంకెళ్లు వేసి కడుపు మాడ్చడమా? లేక దానికి జవసత్వాలనిచ్చి ఒక నాగరిక శక్తిగా చేయడమా అనేది మనపై ఆధారపడి ఉంది'. అంటూ ఈ దృష్టితోనే తను వివిధ తెలుగు సాహిత్య ప్రక్రియల్లో కావ్యసృష్టికి అంకురార్పణ చేసి, పరాకాష్ట స్థాయిలో వాటిని అద్భుతంగా నిర్వహించిన మహాకవి గురజాడ.

గిడుగు జీవితమంతా ప్రత్యర్థి వాదాన్ని పరాస్తం చేయడంలోనే గడిచిపోయింది. సిద్ధాంతానికి అనువర్తన ప్రధానం. ఆచరణ సాధ్యం కాని ఏ సిద్ధాంతమూ నిలబడదు, బతకదు. సామాన్య రచనల్లో, వ్యావహారిక భాషా వాదాన్ని ప్రతిష్టాపించగల సత్తా ఉండదు. లక్ష గ్రంథాలకంటే ఒక మహా కావ్యం తెచ్చిపెట్టగలిగిన గౌరవం మిన్న. ఏ ఆదర్శం కోసమైతే జీవితాన్ని ధారపోస్తామో ఆ ఆదర్శపు ఔన్నత్యాన్ని బట్టి అతడు చరితార్థుడౌతాడని గ్రహించి, 'నాకు కావలసింది నా దేశ భాష, సజీవమైన తెలుగు భాష. నాది ప్రజల ఉద్యమం దానిని ఎవరినో సంతోష పెట్టడానికి వదులుకోలేను' అని ప్రకటించి వ్యావహారిక భాషకు మహాసాహితీ గౌరవం సంపాదించి పెట్టి గిడుగు ఆబోరు దక్కించినవాడు గురజాడ. దీనికి ప్రథమ సాక్షి 'ముత్యాలసరాలు', ప్రధాన సాక్షి 'కన్యాశుల్కం' ముఖ్యమైన సాక్షి 'దేవుళ్లారా మీ పేరేమిటి' వ్యావహారిక భాషా నిరూపకుడు గిడుగు అయితే, ప్రతిష్టాపకుడు గురజాడ. తెలుగు వ్యవహారిక భాషోద్యమానికి వీరిద్దరూ చేసిన సేవ గొప్పది, చిరస్మరణీయమైనది.

(ఈనెల 29 గిడుగు జయంతి, వచ్చేనెల 21 గురజాడ జయంతి)

\- కీ.శే. డా॥ బి.వి.ఎ.రామారావు నాయుడు

నల్లబల్లపై రేపటి ఉషోదయం



డార్విన్‌ని తరగతి గదుల్లోంచి తరిమేసి, తరగతి గదిని గుప్పెట్లో పెట్టుకొని, వేదయుగం అంధత్వాన్ని తరగతి గదుల్లోకి మోసుకొస్తున్న సంక్లిష్ట రాజకీయ, సాంస్కృతిక, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో 'అతడు నల్లబల్ల మీద రేపటి ఉషోదయాన్ని చూస్తున్నాడు' అంటూ అందమైన స్వప్నాలను ప్యాక్ చేసేసి, కడవల కొద్ది దు:ఖాన్ని అందులో కలిపి ముందుకొచ్చాడు కవిమిత్రుడు బాల సుధాకర్, తన 'తరగతి గది స్వప్నం' దీర్ఘ కవితతో. 'ఈ భూమ్మీద గొప్ప ప్రదేశాలుగా విద్యార్థులకు నేను తరచూ చెప్పేది – రెండు ప్రజల ఆకలికి తీర్చే శక్తిని కూర్చే పంట భూమి ఒకటైతే, రెండు – నూతన తరాన్ని తయారు చేసే తరగతి గది. నూతన మానవుని ఆవిష్కరణకు తరగతి గది ఒక కేంద్రమౌతుందని, అవ్వాలని నా నమ్మకం, నా ఆకాంక్ష' అంటున్నారు కవి.

నమ్మకాలు నిజమవ్వడానికి, కలలు వాస్తవ రూపం దాల్చడానికి దానికి అనుబంధంగా శ్రామికవర్గ ప్రయోజనంతో కూడిన వ్యవస్థ, సంస్కృతి ఉండాలి కదా! కానీ, ఆకలిని తీర్చే పంటభూమి నేడు వధ్యశిలగా మారిపోయింది. అసంఖ్యాకులైన రైతన్నల ఆత్మహత్యలతో పంటభూమి తన సౌందర్యాన్ని కోల్పోయింది. కార్పొరేట్ల విష కౌగిలిలో గిలగిలా కొట్టుకుంటోంది. రెండోది 'తరగతి గది' కూడా నూతన తరాన్ని మర మనుషులుగా మార్చేసింది. ఎంతోమంది చిన్నారులను ఉరికంబానికి బిగించింది. మానసిక రోగుల స్టిక్కర్లను అతికించేసింది.

పుస్తకం

అందుకే కవి అంటారు : 'మబ్బుల్లో ఏనుగులను చూడలేని పిల్లలు / కాగితాలతో పడవలు చేయలేని పిల్లలు' అని. కలలు ఒకలా ఉంటే వాస్తవ పరిస్థితులు ఎంత దయనీయంగా ఉన్నాయో! తలను నోట్సు పుస్తకాల నుంచి ఆకాశ మబ్బుల మీదకి మళ్ళించే సౌందర్యారాధనకు నేటి తరాన్ని దూరం చేశాం! మరి, ఎలా మార్చామో, వినాశనాన్ని ఏ స్థాయికి తీసుకుపోయామో కవి మాటల్లో చూద్దాం. "పరీక్ష గదులు శవాలను కుప్పపోసిన మార్చురీలు/ పరీక్ష గదులు మృత్యు వాసనతో వర్ధిల్లుతాయి." (పే 43)

దారుణమైన విద్యా వ్యవస్థను తరగతి గది స్వప్నం ప్రతిబింబిస్తుంది. విద్యార్థుల దయనీయమైన జీవితాలను ఈ దీర్ఘ కవిత ఆవిష్కరిస్తుంది. ఈ కోణంలో మరొక ప్రగతిశీల రచన అని చెప్పొచ్చు. అయితే, కవి తన తరగతి గదిని ఎలా మలచుకుంటున్నాడు. "అతనికి తరగతి గది భూమి అడవి సముద్రం/ తరగతి గది రాబోవు చరిత్రకు ఇప్పటి బీజాక్షరం/ తరగతి గది మానవ మహా చైతన్య శిఖరం." మానవజాతికి చైతన్య శిఖరాల మేద నిల్పోబెట్టిన తరగతి గది, అక్షరం పురుడు పోసుకుంటున్న తరగతి గది, అమ్మై సాకుతూ, నాన్నై నడక నేర్పిస్తోన్న తరగతి గది నేడు ... తన కార్యదీక్షతని కోల్పోయి, ఒక స్వప్నంగా, ఒక వధ్యశిలగా, తలని కిందకి వాల్చి మోకాలిపై కూలిపోతున్న అక్షరాన్ని బాధగా చూస్తూ ఆస్తిత్వాన్ని కోల్పోతుంది.

తరగతి గదుల్లో ఏం జరగాలి? ఏం జరుగుతోంది? తరగతి గదికున్న స్వప్నాలేమిటి? వాస్తవాలేమిటి? మొదలైన విషయాలకు ఈ దీర్ఘ కవిత చర్చిస్తోంది. "రెక్కల చప్పుడు లేని ఒక తరం/ గురి లేని తరం/ పాడలేని తరం/ ఊహలేని తరం/ చదువుల జైళ్ళలో బాల్యం బందీ అవుతున్న పిల్లలు/ బాల్యంలోనే వృద్ధులౌతున్న పిల్లలు.." ఇలా ఎంతో సమర్థంతంగా కవి నేటి విద్యా విధానం మీద సెటైర్ విసురుతాడు. 'అన్నీ కలలే. కలలు నిజం ఎలా అవుతాయి? కళ్ళూ, చూపులూ, చేతులూ, హృదయం సమస్తం కలల్నే మాట్లాడతాయ'ంటాడు కవి మరో దగ్గర. 'ఎడాది భూమిలోంచి పచ్చని అరణ్యం మొలిచే కలలు/ కలల్లో కవి జనం గుండెలోంచి జనంలోకే ఎగిసే ఉద్విగ్న సముద్రాల గురించి మాట్లాడతాడు.

అయితే, కలలెప్పుడూ కలలుగా మిగిలిపోవు. ఏదో ఒక రోజు అవి వాస్తవ రూపం దాల్చాల్సిందే. ఒక నూతన తరాన్ని తరగతి గదిలో సృష్టించాల్సిందే. ఇది తరగతి గదుల్ని నిర్మానుష్యం చేస్తోన్న శక్తులకు సవాలుగా తరగతి గదిని మరలా కొత్త అక్షరాలతో సర్దుకోవల్సిందే. కాషాయ విద్వేషపు అక్షరాలను నల్లబల్ల మీద చెరిపేసి కొత్త మానవుడ్ని తరగతిలో ఆవిష్కరించాల్సిందే! అందుకే, ఈ కవి వాక్యం విల్లులోంచి అక్షరాన్ని బాణంలా వదులుతాడు. నిశ్శబ్ద నైరాశ్యపు గోడను చేధించి గోడ ఆవలి తీరాన్ని చేరుతాడు. నల్లబల్ల ముందు కూర్చున్న ఒక తరం కోసం అక్షరాలను సిద్ధం చేసుకుంటున్నాడు. అవిశ్రాంత అనితర సాధ్యమైన అక్షరాల్ని జాగ్రత్త పరుచుకుంటున్నాడు. రాత్రి పగలు మరణిస్తోన్న పిల్లల్ని బతికించడానికి, బాల్యంలోనే వృద్ధులౌతున్న పిల్లల్లో మరలా నూతన శక్తిని నింపడానికి ఉపాధ్యాయుడు సిద్ధమౌతున్నాడు. కవి సిద్ధమవుతున్నాడు. కవి ఉపాధ్యాయుడ్ని సిద్ధం చేస్తున్నాడు. కొత్త ఉపాధ్యాయుడు చెదిరిన మట్టిలో గూడు నిర్మిస్తాడు. రాలిన ఆకుతో రగడ పుట్టిస్తాడు. అలా తరగతి స్వప్నాన్ని నిజం చేస్తాడు.

ఈ దీర్ఘ కవిత నేటి విద్యా వ్యవస్థపై స్వప్నాలు కూలిపోతున్న విపత్కర పరిస్థితుల్ని దృశ్యీకరిస్తోన్న ప్రగతిశీల ప్రక్రియ. ప్రతి వాక్యం కవి హృదయంలోంచి జాలువారి అత్యంత బలంగా, విస్ఫోటనంగా కనిపిస్తోంది. స్వప్నాల తరగతి గదిని అంగడిగా మార్చేసి, నోట్లకట్టలను పరుకుంటోన్న విష సర్పాలు ఈ కవితలో కనిపిస్తాయి. కొత్త చైతన్యం కోసం నల్లబల్లముందు కూర్చొని ఆశగా ఎదురుచూస్తోన్న ఒక తరాన్ని వినాశనం వైపుకు మరలిస్తోన్న ఆ విద్యా విధానాన్ని ఈ కవిత ప్రశ్నిస్తోంది.తరగతి గదికున్న తాత్విక, సామాజిక చేతనను విసిరికొట్టి, విద్యార్థులను బట్టీ పట్టే మర మనుషులుగా మార్చుతున్న శిథిల సాంస్కృతిక వాతావరణంలో 'తరగతి గది స్వప్నం' ఆహ్వానించదగ్గ పరిణామం.

\- కేశవ్
98313 14213

ప్రజలపక్షం నిలబడిన కవిత్వం



'సమస్త మానవ కార్యకలాపాలకు, సమస్త సంపదలకు కృషియే కీలు చీల' అంటారు ప్రసిద్ధ కవి దువ్వూరి రామిరెడ్డి గారు. కృషి అంటే వ్యవసాయమే కాదు, శ్రమ కూడా. అటువంటి శ్రమను, శ్రమను నమ్ముకుని జీవిస్తున్న శ్రమ జీవులను పట్టించుకునే వాళ్ళు ఎవరున్నారు? తమ అవసరాలు తీర్చే మనుషులను పట్టించు కోవాల్సిన బాధ్యత మనుషుల కు ఉండొద్దూ?

శ్రీశ్రీ అన్నట్టు – గనిలో వనిలో కార్ఖానాలోనే కాదు, నిద్రలేని రాత్రులను, నిప్పులు చెరిగే ఎండలను లెక్క చేయకుండా తమ శరీరాలను పిండి, చెమటనే ఇంధనంతో సంపదలు సృష్టిస్తున్న కష్ట జీవుల, కార్మికుల, రైతుల పట్ల ఆ అట్టడుగు బడుగు జీవితాల పట్ల ఎవరికి నొప్పి ఉంటుంది? వారి వ్యథార్థ గాథల, యథార్థ పరిస్థితుల పట్ల ఎవరికి తీరిక ఉంటుంది? స్వార్థంలో మునకలేచే వారికి తీరిక ఉండదు కాని, మనిషితనం ఇంకిపోని హృదయానికి ఉంటుంది. హృదయమున్న మనిషికి ఉంటుంది.

పుస్తకం

స్పష్టమైన మార్క్సిస్టు రాజకీయ దృక్పథంతో నడిచిన సామాజిక కార్యకర్త ఉన్నం వెంకటేశ్వర్లు. మార్క్సిస్టు దృష్టితో తన రాజకీయ ఆలోచనల్ని, చేతనత్వాన్ని తనదైన అవగాహనతో చదువుకున్న విద్యావంతుడు, దశాబ్దాలుగా సామాజిక బాధ్యతగల పత్రికా సంస్థలో పాత్రికేయ విద్యార్థులకు పాఠాలు బోధించిన అధ్యాపకుడు. ఉద్యమకారుడిగాను, ప్రజాస్వామ్యం పట్ల, సామ్యవాదం పట్ల అమితమైన గౌరవం ఉన్న పౌరుడిగానే కాదు, సామాజిక స్పృహ కలిగిన కవిగా, రచయితగా నిశిత పరిశీలనతో, నిఖార్సయిన దృష్టితో రాసిన కవిత్వమే 'కాలంపై కవాతు'.

వర్తమాన సమాజంలో జరుగుతున్న పరిస్థితుల్ని, సామాజిక స్థితిగతులను సీరియస్‌గా పరిశీలిస్తూ, కార్పొరేట్ శక్తుల కాళ్ళ ముందు సాగిలపడుతున్న రాజకీయాలను, వాటి కుట్రపూరిత వ్యూహాల్లో బలవుతున్న సామాన్య ప్రజా జీవితపు కడగండ్లను, చుట్టూ జరుగుతున్న మానవ హక్కుల హననాన్ని, సాంస్కృతిక విధ్వంసాన్ని ఎప్పటికప్పుడు ఎండగడుతూ, ఒక్కోసారి నిరసనగా ఒక్కోసారి సెటైరికల్‌గా, ఒక్కోసారి తల్లడిల్లిపోయే మానవ హృదయంగా రాసిన కవితల్ని 'కాలంపై కవాతు' సంపుటిలో మనం గమనిస్తాం.

కవి వెంకటేశ్వర్లు అవగాహనలోంచి నేటి సమాజ స్థితికి అద్దంపట్టే కింది వాక్యాలను గమనిస్తే –

"వేషం ప్రపంచీకరణ
వాచకం సరళీకరణ
వాయిద్యం ప్రైవేటీకరణ
సారం వ్యక్తి సంపదీకరణ
రేపటి స్వర్గం మాటల్లో చూపుతూ
జనాన్ని బాధల బావుల్లో దింపుతూ
కుబేరులు సంపదతో ఎగబాకుతున్నారు
జనాలుఉన్నది కోల్పోయి దిగజారుతున్నారు
నిజం పెట్టుబడికే తెలుసు
కష్టం సంపద కనుమరుగు
చట్టం వాటిని చుట్టిన ముసుగు
ఇది అతి పెద్ద మోసాల కలుగు"

(నడుస్తున్న భారతం) అంటారు. అలతి అలతి మాటల్లో సూటిగా పొందుపరిచిన ఈ మాటల్లో మన చుట్టూ కమ్ముకున్న, అంతకంతకూ కబళిస్తున్న మోసపూరిత పరిస్థితులు కనిపిస్తాయి. అంతేకాదు; కాయకష్టం నమ్ముకున్న బడుగుల్ని తమ పెత్తందారులకు దోచిపెట్టే పన్నాగంలో పెద్దన్న పాత్రలు పోషిస్తున్న ప్రభుత్వాల్ని, ప్రజల ఓట్లతో గెలిచి ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్న పాలనా వ్యవస్థని, రాజ్యాంగ విలువలకు తిలోదకా లిస్తున్న దుస్థితిని నేటి నిజాలు అనే కవితలో

"రాజ్యాలు ఇప్పుడు/ కార్పొరేట్ భోజ్యాలు
జాతి జాతీయత వాటి చెప్పు కింద తేళ్ళు
కుల మత అహాలు లాభానికి దాసోహాలు
ప్రపంచమొక పాడిపశువైపితకాలి లాభాలు
అందుకే దేశ పొలిమేరలు చెరిపే
వ్యాపారాలు" అని అభిప్రాయపడతాడు.

అంతేకాదు; "నీ రెక్కల కష్టమే నీకు తోడంటాడు ఒకడు /నీకున్నదాంతో తృప్తి పడంటాడు ఇంకొకడు/ ఈ సంగతి ఆదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు చెప్పండంటే ఒక్కడూ వినడే" అంటూ చుట్టూ కమ్ముకున్న దోపిడీని, దోపిడినుంచి బయట పడాల్సిన ఎరుకను అందిస్తాడు. ముఖ్యంగా నేటి భారతీయ సమాజంలో జరుగుతున్న శ్రమదోపిడి, స్వేచ్ఛ లేమి, సాంస్కృతిక విధ్వంసం వీటన్నిటి పర్యవసానంగా పౌరులు రాజకీయ మాయమాటల చట్రంలో చిక్కుకున్న దుస్థితిని తెలియజేస్తాడు. కాలం ఆర్తిని, ఆవేదనను రికార్డు చేస్తారు.

ఈ సందర్భంలో 'కాలం గుండె చప్పుడే కవిత్వం' అన్న ప్రసిద్ధ కవి శివసాగర్ గారి మాటలు గుర్తుకు వస్తాయి. వీరి కవిత్వాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ కవి కవితాత్మక వ్యక్తీకరణ కోసం పాకులాడటం ఉండదు. సామాజిక స్పృహ, సంఘ చేతన ప్రధానంగా కనిపిస్తుంది. ప్రజల పక్షంగా నిలపబడటం, గొంతు విప్పటం ముఖ్య లక్షణంగా వీరి కవిత్వంలో వినిపిస్తుంది.

ఎంగిలాకు సవాల్, మెతుకు భారత యుద్ధం, రెక్కల కష్టం, మార్కెట్ మాయ, దేశ నిట్టాడులపై దాడి వంటి కవితలతోపాటు, స్త్రీలపై జరుగుతున్న దారుణాలకు నిరసనగా 'ఆయుధం కావడమే ఆమెకు భద్రత' వంటి కవితలను, జరుగుతున్న కుట్రపూరిత రాజకీయాల నుంచి విముక్తి కావడానికి అవసరమైన అవగాహన, చైతన్యాన్ని అందించే కవితల్ని ఈ కవితా సంపుటిలో మన మెదళ్లను కదుపుతాయి. హృదయాన్ని కుదుపుతాయి.

మానవ చైతన్యాన్ని గురించి ఆలోచించే ఎవరికైనా నడుస్తున్న కాలం అత్యంత దుర్మార్గపూరితమైన, విధ్వంసకరమైన శ్రమదోపిడికి, వ్యక్తి స్వేచ్ఛ హననానికి గురికాబడిన, కాబడుతున్న కాలంగా కనిపిస్తుంది. ప్రజా రాజకీయాల నుంచి, కార్పొరేట్ రాజకీయాలుగా మారిన మానవ సమూహాల దేశాలు ప్రపంచవ్యాప్తంగా మనం గమనిస్తాం. వీటన్నిటిని అర్థం చేసుకోవడానికి, వీటన్నిటి నుంచి విముక్తి పొందటానికి ఏ కాలంలోనైనా మార్క్స్, ఎంగెల్స్ ఆలోచనలు అత్యంత అవసరమైనవన్నది మనం మరిచి పోకూడదు. అయితే ప్రపంచ దేశాలన్నింటికి వర్తించే వర్గ దృక్పథం ఒక్కటే భారతీయ సమాజానికి సరిపోదన్నది కూడా వాస్తవం. ఇక్కడ వర్గం కంటే కులం చాలా బలమైంది. ఈ దృష్టిని కవి విస్మరించపోవడం అభినందనీయం. ఎక్కువగా శ్రమ దోపిడీ, ఆర్థిక అసమానతలపై గళాన్ని వినిపించడం స్పష్టమైన వారి మార్క్సిస్టు దృక్పథాన్ని తెలిజేస్తుంది. అందుకే 'చీమల విముక్తి శాస్త్రం' అంటూ కథలాంటి పాఠాన్ని బోధిస్తాడు. కర్తవ్యాన్ని సూచిస్తాడు.

"నీ కండలు వండి పెట్టినా
నీ ఎముకల సూపు తాపినా
వాడి ధనం కడుపు నిండదు
ఎండిన నీ డొక్క దరిద్రం మారదు
ప్రశ్న భుజానేసుకుని.. పేదోడు
మురికి మూలం ఏమిటంటూ
వాడి ధనం పొట్ట చీలిస్తేనే
నీ కష్టం ఎగిరెళ్ళి వాడి
పొట్ట బోషాణంలో
ఎక్కడ దాగిందో తెలుస్తుంది
ప్రశ్నలు లేవకుండా
పరిష్కారాలు దొరకవు" అని ఒక ఉత్తేజాన్నిచ్చి ప్రశ్నించాల్సిన తెగువను, ఉద్యమంలోకి నడవాల్సిన దారిని చూపెడతాడు.

"ప్రజల కవివై గొంతు/ రగిలించి పాడితే
బక్కడొక్కులు రేగి ప్రళయమారుతమట్లు
తక్కువెక్కువలెల్ల ఒక్క దెబ్బను కూల్చి
లోకాల నూగింపరా!
ఓ కవీ!, శోకాల తొలగింపరా!" అని రాసిన తాపీ ధర్మారావు గారి చైతన్యపు దోవలో నడుస్తున్న కవికి శుభాభినందనలు.

"సంపద పెరుగుతున్నా పేదల కష్టాలు ఏ మాత్రం తగ్గటం లేదు అంటే ఈ సామాజిక వ్యవస్థ ఎక్కడో కుళ్లిపోతుందన్న మాటే" అన్న మార్క్స్ వాక్యాలనే మళ్లీ మళ్లీ గుర్తుచేస్తున్న ఈ కవిత్వానికి స్వాగతం చెబుతూ... లాల్ సలాములు.

\- పల్లిపట్టు నాగరాజు
99894 00881

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి.
అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం,
తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర,
గుంటూరు జిల్లా..
prajasavvadi@gmail.com

కరోనాపై బిజెపి మాయమాటలు

- కోవిడ్ కట్టడి భేష్ అంటూ ఊదరగొడుతున్న కల్పిత కథనాలు
- బిజెపి లెక్కలు తప్పని చెప్తున్న డబ్ల్యూహెచ్ఓ గణాంకాలు

న్యూఢిల్లీ : దేశంలో కరోనా కేసులు, మరణాలు, రికవరీ రేటుపై వాస్తవాలను కప్పిపుచ్చుతూ, తప్పుడు గణాంకాలతో జనాలను నమ్మించే చర్యకు అధికార బిజెపి పూనుకున్నది. ఇందుకు ఫేస్‌బుక్, ఎక్స్(ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్రధాన సోషల్ మీడియా వేదికలతో పాటు బిజెపికి అనుకూలంగా పని చేసే వార్త సంస్థలు, యూట్యూబ్ ఛానెళ్లతో ఇలాంటి ప్రచారాలకు తెరలేపుతున్నది. తాజాగా బీజేపీ 'ఎక్స్'లో ఓ వీడియోను షేర్ చేసింది. ఒకప్పుడు భారతదేశం అట్టడుగున ఉన్నదనీ, నేడు ప్రపంచానికి కొత్త మార్గాన్ని చూపుతున్నదని అందులో ఉన్నది. బీజేపీ, ప్రధాని మోడీ, ఇతర మంత్రులు, బీజేపీకి చెందిన మొత్తం ప్రచార యంత్రాంగం కోవిడ్ నిర్వహణకు సంబంధించి నిరంతరం వాదనలు వినిపిస్తున్నారు. ఎన్నికల ముందు ఈ తరహా ప్రచారం మరింత ఉధృతంగా మారింది.

"రియల్ స్టోరీ" పేరుతో జరిగిన ఈ ప్రచార కార్యక్రమంలో హెూస్ట్ రిచా అనిరుధ్ బిజెపి ప్రభుత్వ కోవిడ్ నిర్వహణను ప్రశంసించారు. చాలా అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల కంటే భారతదేశంలో కరోనాతో మరణించిన వారి సంఖ్య చాలా తక్కువని తెలిపారు. ఇప్పుడు ఈ వాదన నిజమేనా? అనే ప్రశ్న తలెత్తుతున్నది. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల కంటే భారత్‌లో నిజంగా కరోనా మరణాలు తక్కువగా ఉన్నాయా? అన్నవి చర్చకు దారి తీస్తున్నది.

కోవిడ్ మరణాల్లో భారత్‌ది మూడో స్థానం

డబ్ల్యూహెచ్ఓ సమాచారం ప్రకారం.. గత మూడేండ్లలో ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 76,98,06,130 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. ఈ సమయంలో, ప్రపంచవ్యాప్తంగా 69,55,497 మంది కోవిడ్ కారణంగా మరణించారు. కోవిడ్ మరణాల కేసులలో భారతదేశం ప్రపంచంలో మూడో స్థానంలో ఉండటం గమనించాల్సిన అంశం. భారత్‌లో కోవిడ్ కారణంగా 5,31,925 మంది మరణించారు. కోవిడ్ మరణాల కేసుల్లో అమెరికా మొదటి స్థానంలో, బ్రెజిల్ రెండో స్థానంలో ఉన్నాయి. కోవిడ్ వల్ల అమెరికాలో 11,27,152 మంది, బ్రెజిల్‌లో 7,04,659 మంది మరణించారు.

కేసుల పరంగానూ భారత్‌ది మూడో స్థానం

మొత్తం కోవిడ్ కేసుల పరంగానూ భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 76,98,06,130 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. అమెరికాలో అత్యధికంగా అంటే 10,34,36,829 కేసులు నమోదయ్యాయి. మూడో స్థానంలో ఉన్న భారత్‌లో 4,49,96,599 కోవిడ్ కేసులు నమోదు కావటం గమనార్హం.

'ఆ దేశాల' కంటే భారత్‌లోనే ఎక్కువ మరణాలు

డబ్ల్యూహెచ్ఓ గణాంకాల ప్రకారం.. కోవిడ్ మరణాల సంఖ్యలో ప్రపంచంలోని 195 దేశాలలో భారత్ మూడో స్థానంలో ఉన్నది. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే భారత్‌లో కోవిడ్ కారణంగా చాలా తక్కువ మరణాలు సంభవించాయని బీజేపీ వాదిస్తున్నది. అయితే, వివిధ దేశాల గణాంకాలు మాత్రం ఈ వాదన తప్పని రుజువు చేస్తున్నాయి.

జపాన్, జర్మనీ, కెనడా, ఇంగ్లాండ్, అమెరికా, చైనా, డెన్మార్క్, ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్, ఫ్రాన్స్, ఇటలీ మొదలైనవి అభివృద్ధి చెందిన దేశాలలో కంటే కోవిడ్ మరణాల సంఖ్య భారత్‌లోనే ఎక్కువ (అమెరికాను మినహాయిస్తే). ఈ సంఖ్య ఈ దేశాలలో భారత్ కంటే ఐదు నుంచి పది రెట్లు తక్కువగా ఉండటం గమనార్హం. భారత్‌లో కోవిడ్‌తో 5,31,925 మంది మరణించారు. జపాన్‌లో 74,694, కెనడాలో 53,147, డెన్మార్క్‌లో 8780, జర్మనీలో 1,74,979, ఇంగ్లండ్‌లో 2,28,707, చైనాలో 1,21,628, ఆస్ట్రేలియాలో 22,696, నెదర్లాండ్స్‌లో 22,986, ఫ్రాన్స్‌లో 1,67,985, ఇటలీలో 1,91,167 కరోనా మరణాలు సంభవించాయి.

ఇటు భారత్ కంటే చిన్న దేశాలతో పోలిస్తే కూడా కరోనా మరణాలు బీజేపీ చేస్తున్న వాదనలు తప్పని నిరూపిస్తున్నాయి. పొరుగు దేశాలలో కూడా భారత్‌లో కంటే కోవిడ్ సమయంలో చాలా రెట్లు తక్కువ మంది మరణించారు. కోవిడ్ కారణంగా పాకిస్తాన్‌లో 30,656 మంది, శ్రీలంకలో 16,882 మంది, బంగ్లాదేశ్‌లో 29,476 మంది, నేపాల్‌లో 12,031 మంది మరణించారు.

కోవిడ్ మరణాల గణాంకాలలో అస్పష్టత

భారత్‌లో కోవిడ్ కారణంగా మరణించిన వారి సంఖ్య అధికారిక గణాంకాల కంటే చాలా ఎక్కువ అని డబ్ల్యూహెచ్ఓ ఒక సందర్భంలో తన నివేదికలలో పేర్కొన్నదని నిపుణులు, విశ్లేషకులు గుర్తు చేశారు. భారత్‌లో కోవిడ్ కారణంగా మరణించిన వారి వాస్తవ సంఖ్య, ప్రభుత్వం చెబుతున్న దానికంటే తొమ్మిది నుంచి పది రెట్లు ఎక్కువ అని డబ్ల్యూహెచ్ఓ పేర్కొన్నట్టు చెప్పారు. ఇలాంటి తరుణంలో మోడీ సర్కారు డబ్ల్యూహెచ్ఓ గణాంకాలపై ప్రశ్నలను లేవనెత్తుతూ, అవన్నీ తప్పని ప్రచారం చేసుకున్నది.

కోవిడ్ సమయంలో కరోనా మరణాలను ఉద్దేశపూర్వకంగా తక్కువగా లెక్కిస్తున్నారని భారత ప్రభుత్వంపై పలు ఆరోపణలు ఉన్నాయి. అంత్యక్రియల స్థలాల వద్ద పొడవైన క్యూలు, వందలాది మృతదేహాలు కాలిపోవడం, నదుల్లో తేలుతున్న మృతదేహాల చిత్రాలు, సంబంధిత వార్తలు కరోనా కాలంలో సోషల్ మీడియాలో, ప్రధాన వార్త పత్రికలు, ఛానెళ్లలో వచ్చిన విషయాన్ని సామాజిక కార్యకర్తలు, విశ్లేషకులు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇది కాకుండా, కోవిడ్ తప్పుడు నిర్వహణ, ఆరోగ్య అత్యవసర పరిస్థితిని శాంతి భద్రతల సమస్యగా పరిగణించడం, లాక్‌డౌన్ సమయంలో ప్రజలకు కలిగే కష్టాలు, కార్మికుల వలసలు, నిలిచిపోయిన వ్యాపారాలు, దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థ వంటి విషయాలను బీజేపీ మర్చిపోయి ఒక విపత్కర పరిస్థితిని సైతం తనకు అనుకూలంగా మలచుకుంటూ తప్పుడు ప్రచారాలకు పూనుకోవటం సరైన తీరు కాదని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

అవినీతిపై మాట్లాడే హక్కు మోడీకి లేదు

- తమిళనాడు సిఎం స్టాలిన్

చెన్నై : అవినీతి గురించి మాట్లాడే నైతిక హక్కు ప్రధాని మోడీకి లేదని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ అవినీతి కార్యకలాపాల గురించి కాగ్ నివేదిక బట్టబయలు చేసిన నేపథ్యంలో అవినీతి గురించి మాట్లాడే హక్కు ప్రధానికి లేదని స్టాలిన్ స్పష్టం చేశారు. తిరువరూర్ జిల్లాలో నాగపట్నం ఎంపి ఎం.సెల్వరాజ్ కుమార్తె పెళ్ళికి హాజరైన స్టాలిన్ అక్కడ మాట్లాడారు. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికల కోసం స్టాలిన్ ఆ వేదిక నుండే తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై, ప్రధాని నరేంద్ర మోడీపై ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు.

భరత్‌మాలా, ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, అయోధ్య డెవలప్‌మెంట్, హెచ్‌ఎఎల్ విమానం రూపకల్పన ప్రాజెక్టులు, హైవే టోల్ ప్లాజాల్లో టోల్స్ వసూలు, ఆయుష్మాన్ భారత్ పథకాలతో సహా వివిధ పథకాల్లో అనేక వందల కోట్ల రూపాయిలు మేరకు అవినీతి జరిగిందని కాగ్ నివేదిక వెల్లడించింది.

ఆయుష్మాన్ భారత్ పథకం కింద చికిత్స పొందుతున్నారని తప్పుడు క్లెయిమ్‌లు చేస్తూ చనిపోయిన రోగుల పేరుతో బీమా క్లెయిమ్‌లు పంపిణీ చేశారు. తమిళనాడులోని పెరానరవద్ద గల టోల్ ప్లాజాతో పాటూ ఐదు ప్లాజాల వద్ద పన్ను వసూళ్ళలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయి, ఇతర పథకాల్లో కూడా కోట్లాది రూపాయిల మేరకు అవినీతి జరిగిందని స్టాలిన్ వివరించారు.

కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖల్లో అవినీతి బాగా పేరుకుపోయిందని, హెూం శాఖలోని పలువురు అధికారులపై గరిష్ట సంఖ్యలో అవినీతి కేసులు నమోదయ్యాయని కేంద్ర విజిలెన్స్ కమిషన్ తన నివేదికలో పేర్కొందని స్టాలిన్ చెప్పారు.

" అవినీతిని కూకటి వేళ్ళతో పీకేస్తామంటూ చెప్పేది ఇలాంటి వ్యక్తులే. వారి తప్పులను కప్పిపుచ్చుకునేందుకు డిఎంకెపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. మమ్మల్ని బెదిరించేందుకు సిబిఐ, ఆదాయ పన్ను, ఇడి వంటి సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారు." అని స్టాలిన్ విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఆర్.ముత్తరాసన్ కోరినట్లుగానే తిరువరూర్ నుండి తాను ఎన్నికల ప్రచారాన్ని ఆరంభించినట్లు స్టాలిన్ అంగీకరించారు.

డిఎంకె నేతృత్వంలోని కూటమి రాష్ట్రాన్ని కాపాడిందని ఆయన చెప్పారు. కేంద్రంలోని బిజెపి 'ఫాసిస్ట్, నియంతృత్వ' పాలనను గద్దె దింపడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని కాపాడాలన్నదే ప్రతిపక్ష పార్టీల తదుపరి లక్ష్యమని చెప్పారు. ఇందుకోసమే ఇండియా బ్లాక్‌ను ఏర్పాటు చేశామన్నారు. ముంబయిలో జరగబోయే ఇండియా కూటమి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంటామని, తాను ఆ సమావేశాలకు హాజరవుతున్నానని చెప్పారు.

ఢిల్లీ మెట్రో స్టేషన్లలో ఖలిస్తానీ రాతలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ మెట్రో రైల్వే స్టేషన్లలో ఖలీస్తానీ అనుకూల రాతలు కనిపించడం కలకలం సృష్టించింది. ఆదివారం ఉదయం ఢిల్లీలోని ఐదు మెట్రో స్టేషన్ల గోడలపై ఖలిస్థాన్‌కు మద్దతుగా గ్రాఫిటీ (రంగులతో స్ప్రే చేయడం)తో రాశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీస్ కమిషనర్ తెలిపారు. సిఖ్ ఫర్ జస్టిస్ పేరుతో ఖలిస్థాన్‌కు మద్దతుగా శివాజీ పార్క్ మెట్రో స్టేషన్ నుంచి పంజాబీ బాగ్ వరకు ఉన్న పలు స్టేషన్లలో రాశారు. సెప్టెంబరు 9, 10 తేదీల్లో ఢిల్లీలో జీ20 సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఈ రాతలు కలకలం రేపుతున్నాయి.

చంద్రయాన్-3 మహిళా సాధికారతకు చిహ్నం

- తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు
- మన్ కీ బాత్ లో ప్రధాని మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

చంద్రయాన్-3 మహిళా సాధికారతకు చిహ్నమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఆదివారం ప్రధాని మోడీ మన్ కీ బాత్ 104వ ఎపిసోడ్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చంద్రయాన్-3 భారత్ విజయానికి ఎప్పటికీ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. భారత్ వచ్చే నెల ఢిల్లీలో జి20 సమావేశాలకు సిద్ధమవుతోందని, గతంలో ఎన్నడూ లేని విధంగా సుమారు 40 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరుకానున్నారని వెల్లడించారు. తొలిసారి భారత్ ఈ స్థాయి జి-20లో భాగస్వామి అవుతోందని, గ్రూపును మరింత కలుపుగోలుగా చేస్తోందని చెప్పారు. జి-20కి భారత్ అధ్యక్షత వహించడమంటే, ప్రజలే అధ్యక్షత వహిస్తున్నట్లు భావించాలని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

"భారత్ జీ-20 అధ్యక్షత బాధ్యతలను స్వీకరించిన నాటి నుంచి గర్వించదగిన పరిణామాలు చాలా చోటు చేసుకొన్నాయి. ఇప్పటి వరకు ఈ సదస్సులు జరిగిన నగరాల్లో ప్రజలు విదేశీ అతిథులను సాదరంగా ఆహ్వానించారు. దేశంలోని వైవిధ్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని చూసి విదేశీ అతిథులు చాలా ప్రభావితమయ్యారు. దేశం చాలా ఉజ్వల భవిష్యత్తు ఉందని తెలుసుకొన్నారు. జి-20 సదస్సు శ్రీనగర్ లో జరిగిన తరువాత పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దేశం క్రీడల్లో నిలకడగా విజయాలు సాధిస్తోంది. తాజాగా చైనాలో జరిగిన ప్రపంచ విశ్వవిద్యాలయాల క్రీడల్లో రికార్డు స్థాయిలో మనవాళ్లు పతకాలు సాధించారు. ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం నాడు దాదాపు 10 కోట్ల మంది జాతీయ పతాకంతో సెల్ఫీ దిగారు" అని అన్నారు.

"ప్రజలకు మాతృత భాషను బోధించడంలో భాగంగా జరిగే క్యాంపులో మీరూ పాల్గొనవచ్చు. అంతేకాదు.. తెలుగు కూడా సంస్కృతంలా పురాతనమైన భారతీయ భాష. ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవం నిర్వహించుకుంటున్నాం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 'మేరీ మాటి.. మేరీ దేశ్' కార్యక్రమం జోరుగా జరుగుతోంది. సెప్టెంబర్ నెలలో దేశ వ్యాప్తంగా ప్రతి ఇల్లు, ప్రతి గ్రామం నుంచి మట్టి నమూనా సేకరించే కార్యక్రమం ఉద్యమ స్థాయిలో జరుగుతుంది" అని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

ఆస్ట్రేలియాలో కూలిన అమెరికా సైనిక హెలికాప్టర్

సిడ్నీ : ఆస్ట్రేలియాలో జరుగుతున్న యుద్ధ విన్యాసాల్లో అమెరికాకు చెందిన హెలికాప్టర్ కూలిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు మెరైన్స్ మరణించగా.. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. అమెరికాకు చెందిన ఎంవీ-22బీ ఓస్ప్రే హెలికాప్టర్ దాదాపు 23 మందితో ఆస్ట్రేలియాలోని ఉత్తర డార్విన్ ప్రాంతంలోని తివి ద్వీపం వద్దకు వెళుతుండగా మాల్విల్ ద్వీపం వద్ద కూలిపోయింది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో 'ప్రిడేటర్ రన్' పేరిట యుద్ధ విన్యాసాలు జరుగుతున్నాయి. ఆస్ట్రేలియా, అమెరికా, ఫిలిప్పీన్స్, ఈస్ట్ తైమూర్, ఇండోనేషియాకు చెందిన 2,500 సైనికులు దీనిలో పాల్గొన్నారు. "ఈ విమానంలోని మెరైన్లు యుద్ధ విన్యాసాల పనుల కోసం వెళుతున్నారు. ప్రస్తుతం శకలాలను గుర్తించే కార్యక్రమం కొనసాగుతోంది. ఈ ప్రమాద ఘటనపై విచారణ జరుపుతున్నాం" అని డార్విన్ రొటేషనల్ ఫోర్స్ ఓ ప్రకటనలో వెల్లడించింది. కాగా ఓస్ప్రే హెలికాప్టర్లు ఎక్కువగా ప్రమాదాలకు గురయ్యాయి. 2022లో ఈ రకం హెలికాప్టర్ కూలి ఐదుగురు మెరైన్స్ చనిపోయారు. అదే ఏడాది నాటో శిక్షణ సమయంలో నార్వేలో మరొకటి కూలిపోయింది. ఈ ఘటనలో నలుగురు సిబ్బంది చనిపోయారు. 2017లో కూడా రెండు కూలిపోయాయి. 2000వ సంవత్సరం నుంచి దాదాపు 11 హెలికాప్టర్లు కూలిపోయాయి.

నేడు ఎన్‌టిఆర్ నాణెం ఆవిష్కరణ

- విడుదల చేయనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ముద్రించిన ఎన్‌టిఆర్ నాణాన్ని సోమవారం ఆవిష్కరించనున్నారు. రాష్ట్రపతి భవన్‌లో ఈ నాణాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇప్పటికే ఎన్‌టిఆర్ కుటుంబ సభ్యులు ఢిల్లీకి చేరుకున్నారు. 44 మిల్లీ మీటర్ల చుట్టుకొలతతో ఉండే ఈ వంద రూపాయిల నాణేన్ని 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింక్‌తో తయారు చేశారు. అలాగే ఈ నాణేనికి ఓ వైపు మూడు సింహాలతో పాటు అశోక చక్రం ఉండగా మరోవైపు ఎన్‌టిఆర్ చిత్రం, ఆ చిత్రం కింద నందమూరి తారక రామారావు శతజయంతి అని హిందీ భాషలో ముద్రించారు. ఎన్‌టిఆర్ శతజయంతి ఈ ఏడాదితో ముగిసింది. కనుక 1923- 2023 అని ముద్రితమై ఉంది. ఎన్‌టిఆర్ రూ.వంద నాణెం విడుదల కార్యక్రమానికి సంబంధించి ఆయన కుటుంబ సభ్యులకు కేంద్ర ప్రభుత్వం ఆహ్వానాలు పంపిన విషయం తెలిసిందే. ఇక టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఆయన ఆదివారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. నాణేం విడుదల తరువాత చంద్రబాబు, ఆంధ్రప్రదేశ్‌లో దొంగ నోట్ల వ్యవహారంపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నారు.

జింబాబ్వే అధ్యక్షుడిగా మరోసారి మనగగ్వా ఎన్నిక

హరారె : ఈ వారం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో జింబాబ్వే అధ్యక్షుడిగా ఎమర్సన్ మనగగ్వా తిరిగి ఎన్నికయ్యారని ఎన్నికల కమిషన్ శనివారం ప్రకటించింది. దాదాపు 53శాతం ఓట్లు ఆయనకు పోలయ్యాయి. కాగా ప్రతిపక్షాలు, రాజకీయ విశ్లేషకులు ఈ ఎన్నికల ఫలితాన్ని ప్రశ్నిస్తున్నారు. 2017లో సైనిక కుట్ర తర్వాత అప్పటి అధ్యక్షుడు రాబర్ట్ ముగాబె నుండి అధికార పగ్గాలు అందుకున్న మనగగ్వా రెండోసారి ఎన్నికవుతారని అందరూ భావిస్తునే వున్నారు. గత నాలుగు దశాబ్దాలకు పైగా అధికారంలో వున్న జాను-పిఎఫ్ పాలక పార్టీకే అనుకూలంగా పరిస్థితులు వున్నాయని విశ్లేషకులు కూడా పేర్కొంటూ వచ్చారు. ప్రధాన ప్రత్యర్థి, ప్రతిపక్ష సిటిజన్స్ కొయిలేషన్ ఫర్ ఛేంజ్ (సిసిసి) పార్టీకి చెందిన నెల్సన్ చామిసాకు 44శాతం ఓట్లు లభించాయని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. కాగా ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే పాలక పార్టీ మద్దతుదారులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. సరిగా పరిశీలన లేకుండా హడావిడిగా ప్రకటించే ఏ ఫలితాన్నైనా తమ పార్టీ వ్యతిరేకిస్తుందని సిసిసి ప్రతినిధి పేర్కొన్నారు. గత అధ్యక్ష ఎన్నికల్లో కూడా మనగగ్వాపై స్వల్ప తేడాతో చామిసా ఓడిపోయారు. ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని ప్రతిపక్షం ఆరోపిస్తోంది. కాగా రాజ్యాంగ కోర్టు ఈ ఫలితాలను ధృవీకరించింది.

అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం

- ముగ్గురి మృతి

జాక్సన్‌విల్లె: అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం సష్టించాయి. ఫ్లోరిడా రాష్ట్రంలోని జాక్సన్‌విల్లెలో ఉన్న డాలర్ జనరల్ స్టోర్ వద్ద ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మరణించారు. వీరంతా నల్లజాతీయులే. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకోగా.. సాయుధ దుండగుడు స్టోర్‌లోకి చొరబడ్డాడు. కాల్పుల సమయంలో అతడికీ తీవ్ర గాయాలు కావడంతో మరణించాడు. అమెరికా కాలమానం ప్రకారం శనివారం మధ్యాహ్నం ఏఆర్-15 స్టైల్ రైఫిల్‌తోపాటు మరో హ్యాండ్‌గన్‌తో స్టోర్ వద్దకు వచ్చిన సాయుధ దుండగుడు కాల్పులకు తెగించాడు. జాత్యాహంకారంతోనే దుండగుడు వారిపై కాల్పులు జరిపినట్లు జాక్సన్‌విల్లె పోలీసులు వెల్లడించారు.

హేయమైన హత్యలకు ఇక జీవితాంతం జైల్లోనే !

- కొత్త చట్టాలను తీసుకురానున్న బ్రిటన్

లండన్ : దారుణమైన నేరాలకు శిక్షలు కూడా కఠినంగా వుండేలా కొత్త చట్టాలను తీసుకువచ్చే ప్రణాళికల గురించి బ్రిటీష్ ప్రధాని రిషి సునాక్ వెల్లడించారు. హేయమైన హత్యలకు పాల్పడిన వారికి పూర్తిస్థాయిలో యావజ్జీవిత ఖైదు విధించాలని, వారికి పెరోల్ ఇవ్వడం లేదా త్వరగా విడుదల చేసే అవకాశాలను పరిశీలించరాదని భావిస్తున్నారు. అత్యంత భయానకమైన రీతిలో హత్యలు చేసిన హంతకులకు యావజ్జీవం అంటే యావజ్జీవితం జైల్లోనే వుండాలని, న్యాయమూర్తులు ఆ రకంగా ఆదేశాలు జారీ చేయాల్సి వుందని సునాక్ చెప్పారు. చాలా పరిమితం సందర్భాల్లో మినహా మొత్తంగా జీవిత ఖైదును న్యాయమూర్తులు విధించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ మేరకు కొత్త చట్టాన్ని తీసుకురానున్నారు. 'ఇటీవల కాలంలో నేరాల్లోని క్రూరత్వాన్ని మనం చూశాం. అటువంటి కేసుల్లో దోషులకు పూర్తి స్థాయిలో శిక్ష పడాలని ప్రజలు కోరుకుంటారు. శిక్ష విధింపులో నిజాయితీ వుండాలని వారు భావిస్తారు.' అని సునాక్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కొత్త చట్టం తీసుకురావడం ద్వారా దోషులకు పూర్తి స్థాయిలో కఠిన శిక్ష అమలయ్యేలా చూడనున్నట్లు చెప్పారు. ఇక వారెన్నడూ స్వేచ్ఛగా తిరగలేరని అన్నారు. నర్సు లూసీ కేసు వెలుగు చూసిన నేపథ్యంలో సునాక్ ఈ ప్రకటన చేశారు. ఉత్తర ఇంగ్లండ్‌లో తాను పనిచేస్తున్న ఆస్పత్రిలో తన సంరక్షణలో వున్న ఏడుగురు నవజాత శిశువులను దారుణంగా హతమార్చిన లూసీకి యావజ్జీవం విధించారు.

బ్రిటన్ చట్ట నిబంధనల ప్రకారం ఉరి శిక్షకు అనుమతి లేదు. అందువల్ల కఠిన శిక్ష అంటే యావజ్జీవితమే. పై కోర్టుల్లో అప్పీల్ చేసుకోవడానికి అనుమతిల్లేకుండా యావజ్జీవం పూర్తి స్థాయిలో అమలు చేయడమే సరైన చర్య అని సునాక్ ప్రభుత్వం భావిస్తోంది.

మరో వివాదంలో రిషి సునాక్

బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ మరో వివాదంలో చిక్కుకొన్నారు. బ్రెగ్జిట్ తర్వాత ప్రతిపాదిత భారత్-బ్రిటన్ వాణిజ్య ఒప్పందం నుంచి సునాక్ కుటుంబం లబ్ధి పొందనుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం ఈ ఒప్పందంపై భారత్-బ్రిటన్ దేశాలు చర్చలు జరుపుతున్నాయి. రిషి సునాక్ భార్య అక్షితా మూర్తికి ఇన్ఫోసిస్‌లో 500 మిలియన్ డాలర్ల విలువైన షేర్లు ఉండటం, ఇన్ఫోసిస్‌కు యూకేలోని ప్రభుత్వ, ప్రైవేటు కాంట్రాక్టులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఒప్పందంపై బ్రిటన్ పార్లమెంటేరియన్లు, వాణిజ్య నిపుణులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఒప్పందంతో ఆ కంపెనీకి లబ్ధి చేకూరేలా లబ్ధి చేకూరుతుందనే ఆందోళన వెలిబుచ్చారు. అక్షితాకు ఇన్ఫీలో షేర్లు, ఆమెకు లభించే ప్రయోజనాలపై మరింత పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ ఒప్పందంతో ఇన్ఫోసిస్‌కు ఎటువంటి లబ్ధి లభిస్తుందనే అంశాలపై మరింత స్పష్టంగా వెల్లడించాలని పేర్కొన్నారు. వాణిజ్య చర్చల నుంచి సునాక్ వైదొలగాలని సూచించారు. అక్షితా మూర్తికి ఛైల్డ్ కేర్ సంస్థలో ఉన్న వాటాలను సరిగ్గా వెల్లడించలేదని యూకే పార్లమెంట్ స్టాండర్డ్స్ వాచ్‌డాగ్ ఇటీవల వెల్లడించింది.

న్యాయసంస్కరణలకు వ్యతిరేకంగా భారీ నిరసన

టెల్ అవీవ్. న్యాయవ్యవస్థను సరిదిద్దడానికి ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వం చేసిన ప్రణాళికలకు వ్యతిరేకంగా 34వ వారం భారీ నిరసన. పెద్ద బ్యానర్‌పై నెతన్యాహు, అతని భార్య సారా హిబ్రూతో వర్ణించింది.

'ఇండియా' ప్రధాని అభ్యర్థి రాహులే : అశోక్ గెహ్లాట్

జైపూర్: 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి ప్రధానమంత్రి అభ్యర్థిగా రాహుల్ గాంధీ బరిలోకి దిగనున్నారు. ఈ విషయాన్ని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ వెల్లడించారు. ఈ విషయంపై ఇండియా కూటమిలో చర్చించినట్లు, ప్రధాని అభ్యర్థిగా రాహుల్ ఉండేందుకు అన్ని పార్టీలు అంగీకరించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా అశోక్ గెహ్లాట్ మాట్లాడుతూ '2014లో ప్రధాని పదవి చేపట్టిన నాటి నుంచే మోడీ అహంకారపూరిత వైఖరిని ప్రదర్శిస్తున్నారు. కేవలం 31 శాతం ఓట్లతో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మిగిలిన 69 శాతం ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారనే విషయాన్ని మోడీ గ్రహించాలి. మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని మోడీ ధీమా వ్యక్తం చేసినా , అది ఎప్పటికీ జరగదు. ఎందుకంటే, జనాదరణ ఉన్నప్పుడే మోడీకి 50 శాతం ఓట్లు పడలేదు. అలాంటిది.. ఇప్పుడు అది ఎలా సాధ్యం అవుతుంది' అని అశోక్ గెహ్లాట్ ప్రశ్నించారు. ఇప్పటి వరకు ప్రధాని ఎన్నో వాగ్దానాలు చేశారని.. వాటిని ఎంతవరకు అమలు చేశారో ప్రజలకు తెలుసున్నారు.

బిజెపి ఎంపి ఇంట్లో బాలుడి అనుమానస్పద మృతి

గౌహతి : బిజెపి ఎంపి ఇంట్లో పదేళ్ల బాలుడు అనుమానాస్పద రీతిలో మరణించిన ఘటన అస్సాంలోని సిల్చార్ లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిల్చార్ లోక్‌సభ ఎంపీ రాజ్‌దీప్ రాయ్ (బిజెపి) ఇంట్లో ధోలాయ్ ప్రాంతానికి చెందిన మహిళ రెండున్నరేళ్లుగా పనిచేస్తోంది. అదే ఇంట్లోని మొదటి అంతస్తులోని ఓ గదిలో మహిళ పదేళ్ల కుమారుడు, కుమార్తె కూడా ఉంటున్నారు. శనివారం సాయంత్రం కుటుంబంతో కలిసి భోజనం చేసిన తర్వాత.. బాలుడు తల్లిని ఫోన్ అడిగి తీసుకున్నాడు. అనంతరం ఇంట్లో పై అంతస్తులో పనిచేసేందుకు బాలుడి తల్లి, సోదరి వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత వారు తిరిగి తమ గదికి వచ్చి చూడగా.. బాలుడు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీనిపై పోలీసులకు సమాచారం అందించడంతో గది తలుపులు పగలగొట్టి బాలుడిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మతి చెందినట్లు ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. ఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముంబయి హోటల్‌లో అగ్ని ప్రమాదం

ముంబయి: మహారాష్ట్ర రాజధాని ముంబయిలో ఒక హెూటల్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. హెూటల్ గెలాక్సీలో మంటలు చెలరేగడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడ్డారు. శాంతాక్రూజ్ ప్రాంతంలోని ప్రభాత్‌నగర్ కాలనీలో ఉన్న ఈ హెూటల్ రెండో అంతస్తులో ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. రాత్రి వరకూ సహాయక చర్యలు కొనసాగాయి. ఎనిమిది మందిని సురక్షితంగా రక్షించారు. ఈ ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదు.

కాశ్మీర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తా : గులాం నబీ అజాద్

శ్రీనగర్: జమ్మూకాశ్మీర్‌ను అభివృద్ధి చేసి, నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తానని మాజీ సీఎం, కేంద్ర మాజీ మంత్రి గులాం నబీ ఆజాద్ హామీ ఇచ్చారు. ఆయన స్థాపించిన డెమోక్రటిక్ ప్రోగ్రసివ్ ఆజాద్‌పార్టీ గెలిపిస్తే పర్యాటక రంగంపై దృష్టి పెడతానని చెప్పారు. ఆదివారం పుల్వామా జిల్లాలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. అలాగే కొండచరియలు విరిగిపడుతుండటంతో వల్ల రాంబన్ – బనిహాల్ మధ్య తరచూ ఏర్పడుతున్న రహదారి దిగ్బంధనాలకు శాశ్వత పరిష్కారం చూపుతానన్నారు.పర్యాటక అభివృద్ధితో యువకులే హెూటళ్లు, రెస్టారంట్లు ఇతర సర్వీసులను పర్యాటకులకు అందించడం ద్వారా ఉపాధి కోసం ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానాలుగా మార్చేందుకు రోడ్డు కనెక్టివిటీ, విద్యుత్ అత్యంత కీలకమని చెప్పారు.

మీకోసం

చిన్నగా కోసిన నిమ్మకాయ ముక్కలు, ఒక చిన్న గ్లాసు నీళ్లను సన్న మంటపై వేడిచేస్తూ.. అందులో ఒక చెంచా సోడా ఉప్పు, ఒక చిన్న మూత వెనిగర్ వేసి కాసేపు మరిగించుకోవాలి. ఇలా తయారైన ద్రావణంతో స్టీలు, ఇత్తడి గిన్నెలు, గ్యాస్ స్టవ్, సింకులు శుభ్రం చేసుకుంటే మురికి త్వరగా పోతుంది.

జీవన సౌరభం

గెలిచినవాడు ఆనందంగా ఉంటాడు. ఓడినవాడు విచారంగా ఉంటాడు. అవి రెండూ శాశ్వతం కాదని తెలిసిన వాడు సంతోషంగా ఉంటాడు.

తెలుగు... జగతికి వెలుగు!

గడ్డ పెరుగు కమ్మదనం
తెలుగు భాష ఆనందం
తేనె లొలుకు తీయదనం
తెలుగు భాషకే సొంతం

అచ్చులతో అంతమయ్యే
అజంతా భాష తెలుగు
పొడుపు కథల మర్మంతో
పదును పెట్టు మన తెలుగు

ముత్యాలను మురిపించే
అక్షరాల అందం తెలుగు
తెలుగు తల్లి మెడలో
మల్లెపూల దండ తెలుగు

అల్లూరి పౌరుషంలో
ఉద్వేగం తెలుగు
కాకతీయ రుద్రమ్మ
ధైర్యమే తెలుగు
గోదావరి కృష్ణమ్మ
పరవళ్ళు తెలుగు
అన్నమయ్య కీర్తనలో
పరవశించిన తెలుగు

చిన్నారి ముద్దు పలుకులకు
సొబగులు అద్దిన తెలుగు
గిడుగు వ్యవహారికమై
జనావళికి చేరువైన తెలుగు

సామెతల నుడికారాల
మెరుపు తెలుగు
పద్య గద్యాలలో
ఒదిగిన తెలుగు

మనసైన మన తెలుగు
శతకోటి రతనాల జిలుగు
అన్య భాష వారు మెచ్చిన తెలుగు
జగతికి అందించు వెలుగు

- మొర్రి గోపి,
88978 82202



తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ ఒకేలా కనిపిస్తున్న ఈ బొమ్మల్లో ఐదు తేడాలు ఉన్నాయి. కనిపెట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ

ఆర్. హేమ సాయి హాసిని,
8వ తరగతి,
అరవింద హై స్కూల్,
కుంచనపల్లి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

విద్యావనంలో 'సేంద్రియ' ఆహారం!

విద్యార్థుల ఆరోగ్యం మా బాధ్యతగా భావించాం

దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడి వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు అనారోగ్యం పాలు కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. అందుకే మా వంతుగా మూడు ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలను సాగుచేస్తున్నాం. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, తీగ జాతి కూరలు పండిస్తూ వాటినే వండించి పెట్టడం ద్వారా విద్యార్థులు వారి ఇంట్లో అందే ఆహారంలా భావిస్తున్నారు. మాకు కూడా మంచి పౌష్టికాహారం అందిస్తున్నామనే సంతృప్తి ఉంది. కూరగాయలు పండించటానికి సేంద్రియ ఎరువులను మాత్రమే వాడుతున్నాం. ఆహ్లాదభరిత వాతావరణంలో, అత్యాధునిక సౌకర్యాలతో, నిష్ణాతులతో ఉన్నత విలువలతో ఏఎన్‌యులో విద్యా బోధన జరుగుతోంది.

- ఆచార్య పి.రాజశేఖర్
వైస్ ఛాన్సలర్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

ఏ విశ్వవిద్యాలయంలోనైనా ఉన్నత విద్య అందుతుంది. ఈ విశ్వ విద్యాలయంలో మాత్రం చదువుతో పాటు- ఇక్కడే పండించిన సేంద్రియ కాయగూరలతో హాస్టలు విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం కూడా అందుతుంది. "మంచి ఆహారం ఇస్తే విద్యార్థులు చురుగ్గా ఉంటారు. ఏకాగ్రతతో చదువుకుంటారు. సృజనాత్మకతతో ఆలోచిస్తారు." అన్న వైస్ ఛాన్సలర్ ఆచార్య రాజశేఖర్ పట్టేటి ఆలోచన ఈ ప్రయోగానికి ప్రేరణ. ఎలాంటి రసాయనిక ఎరువులు వాడకుండా కేవలం సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు వంటివి పండించి, వాటిని విద్యార్థులకే అందిస్తూ వారి ఆరోగ్య పరిరక్షణకు యూనివర్శిటీ ప్రతినిధులు కృషి చేస్తున్నారు.

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దటమే కాకుండా వారికి ఆరోగ్యపరమైన వసతి, ఆహారం అందించటం ద్వారా గుంటూరు జిల్లా నాగార్జున నగర్‌లోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతోంది. 'పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు.' 'పర్యావరణాన్ని రక్షిస్తేనే మన భవిష్యత్తు'. 'మానవ మనుగడ కోసం పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం.' ... ఇలాంటి ఈ నినాదాలు తరచూ మనం వింటూనే ఉంటాం. కానీ..ఈ నినాదాలన్నింటికీ భిన్నంగా ఇక్కడి విసి ఆచార్య రాజశేఖర్ పట్టేటి ఓ ప్రత్యేక నినాదంతో పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించారు. ప్రయత్నం ప్రారంభంలో ఆయన ఒక్కరే.. అయినా వెనకడుగు వేయలేదు. వృక్షో రక్షతి రక్షిత: అంటూ పచ్చదనానికి నిలువెత్తు రూపంగా మారారు.. గత నాలుగేళ్లుగా ఆయన యూనివర్శిటీలో వందలాది మొక్కలు నాటి, నాటించటం ద్వారా ఆదర్శవంతమైన కృషి చేస్తున్నారు.

ఆయన దినచర్య ఉదయం మొక్కల సందర్శనతో మొదలవుతుంది. కొంత సమయం మొక్కలతో గడుపుతారు. మళ్లీ అదే మొక్కలతోనే ఆ రోజూ దినచర్య ముగుస్తుంది. నాటిన మొక్కలు నిర్వీర్యం కాకుండా నీళ్ల పోయించటం, ఆలనా పాలనా వంటివి సిబ్బంది ద్వారా పర్యవేక్షిస్తున్నారు. మొక్కలు నాటితేనే మానవ మనుగడ.. లేకపోతే.. భవిష్యత్తు అంధకారమే.. అందుకే మొక్కలు నాటండి.. అంటూ అవగాహన కల్పిస్తారు.

విద్య, ఆరోగ్యం పరిరక్షణకు ప్రాధాన్యం

విద్యార్థి వికాసానికి విలువలతో కూడిన విద్యా బోధన అవసరం. విద్యార్జనలో విద్యార్థి ప్రగతి చురుకుగా సాగాలంటే అతనికి సంపూర్ణ ఆరోగ్యం ఉండాలి. పరిపూర్ణ ఆరోగ్యం దక్కాలంటే అతనికి పోషక విలువలతో వున్న ఆహారం సదా అందుతూ ఉండాలి. ప్రకృతి రమణీయతకు ఏఎన్‌యుకు మంచి పేరుంది. సేంద్రీయ వ్యవసాయంతో పండించిన ఆకుకూరలు, కూరగాయలతో విద్యార్థులకు ఆహారం అందజేస్తూ మిగతా యూనివర్శిటీలకు ఆదర్శంగా నిలపటానికి వీసీ నిరంతరం కృషిచేస్తున్నారు. ఎన్‌యు హాస్టళ్లలోని విద్యార్థినీ విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని, సహజ సిద్ధమైన పద్ధతులతో పండించిన ఆహారాన్ని అందించాలని ఆయన ఎఫ్ఏసీ వీసీగా ఉన్నప్పుడు ఆలోచించారు. విశ్వవిద్యాలయంలోని మూడు ఎకరాల స్థలంలో కూరగాయలు, ఆకు కూరలు, పండ్ల మొక్కలు నాటించి ఒక కొత్త ఆలోచనకు అంకురార్పణ చేశారు. వాటికి కావాల్సిన పోషణ చేయిస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా సేంద్రియ పద్ధతులతో కూరగాయలు, ఆకు కూరలు పండించి వాటితో హాస్టళ్లలో వండించి, విద్యార్థులకు అందిస్తున్నారు. ఇలా విద్యార్థులకు నాణ్యమైన పోషకాలతో కూడిన ఆహారం అందుతోంది.

ఈ వ్యవసాయ క్షేత్రం సందర్శకులను, ఆచార్యులను, విద్యార్థులను విశేషంగా ఆకర్షిస్తోంది. ప్రకృతి రమణీయతతో హెర్బల్ గార్డెన్, బొటానికల్ గార్డెన్ వంటివి ఆకర్షిస్తున్నాయి. విశ్వ విద్యాలయ రెక్టార్ ఆచార్య పి.వర ప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ సైతం తీరిక వేళల్లో పర్యవేక్షిస్తున్నారు. అధ్యాపకులు రాజు సైతం తన వంతుగా కృషి చేస్తున్నారు.

- త్రివిక్రమ్ సుఖవాసి
అధ్యాపకులు, జర్నలిజం విభాగం, ఏఎన్‌యు.

తెలుగు సినిమాలో జానపదాల జోరు

తెలుగు సినిమాకు జానపద గీతం జోరును తీసుకొచ్చింది. ఈ మధ్య దర్శక నిర్మాతలు తమ చిత్రంలో ఒక జానపద బాణీ అయినా ఉండేలా దృష్టిపెడుతున్నారు. సిచ్యువేషన్ ఏదైనా పాపులర్ ఫోక్ సాంగ్స్‌తో హిట్ కొడుతున్నారు. స్టార్ హీరోలు కూడా తమ సినిమాల్లో ఫోక్ సాంగ్స్ ఉండేలా చూసుకుంటున్నారు. అల్లు అర్జున్‌తో సుకుమార్ తీసిన 'పుష్ప' సినిమాలో 'సామి సామి' అంటూ టీజింగ్‌గా పాట కొనసాగింది. పవన్ కళ్యాణ్ భీమ్లానాయక్‌లో 'ఆడ గాదు.. ఈడ గాదు' అంటూ ఫోక్ ఆర్టిస్ట్ కిన్నెర మొగులయ్య జానపద పాటకు మోడర్న్ టచ్ ఇచ్చింది. నాగశౌర్య హీరోగా థమన్ మ్యూజిక్ డైరెక్షన్లో వచ్చిన 'వరుడు కావలెను' సినిమాలో 'దిగు.. దిగు... దిగు నాగ' పాట అందర్నీ అలరించింది. సుధీర్ బాబు, కరుణకుమార్ కాంబినేషన్లో శ్రీదేవి సోడా సెంటర్ సినిమాలో ఐటమ్ సాంగ్‌గా 'మందులోడా' ఫోక్ సాంగ్ కూడా బాగా పాపులర్ అయింది. గోపీచంద్, తమన్నా జంటగా సంపత్ నంది డైరెక్షన్లో తెరకెక్కిన 'సీటీ మార్' సినిమాలో జ్వాలారెడ్డి పాట.. తెలంగాణలో పాపులర్ అయిన పోరు తెలంగాణ పాటలను పోలిన విధంగా తీసుకుని తెరకెక్కించారు. జానపద బాణీ గీతాల్లో అన్నింటిలో సూపర్ హిట్‌గా నిలిచిన పాట 'సారంగదరియా'. తన సినిమాల్లో ఫోక్ సాంగ్ ఉండేలా చూసుకునే శేఖర్ కమ్ముల.. లవ్ స్టోరీలో సారంగధరియా పాటకు సాయిపల్లవి నృత్యం మరింత పాపులారిటీ తెచ్చింది.

పాపులారిటీ కోసం సరికొత్త బాణీలు

పాపులారిటీ, వివాదం రెండింటితో జనం నోళ్లలో నానిన సాంగ్ 'దిగు దిగు దిగు నాగా'. అసలైన పాటని అష్టవంకర్లు తిప్పి అశ్లీల పదాలు గుప్పించారని సినిమా గీత రచయిత అనంత్ శ్రీరామ్‌పై చాలా విమర్శలొచ్చాయి. తెలుగు రాష్ట్రాల్లో బాగా పాపులర్ అయిన ఈ జానపద గీతాన్ని సినిమా కోసం మార్చి రాశారు గేయ రచయిత. సాంప్రదాయ విలువలు అంటూ రాజకీయాలు కూడా మాట్లాడే అనంత్ శ్రీరామ్‌కి తాను సమర్థించే సనాతనవాదుల నుంచే విమర్శలు ఎదుర్కోవల్సి వచ్చింది. రచనకు కొంత స్వేచ్ఛ అవసరమని, దానిపై దాడి చేయడం తగదని అభ్యుదయ సమర్థకులే అతడికి దన్నుగా వాదించారు.

శర్వానంద్, ప్రియాంక అరుల్ మోహన్ జంటగా నటించిన 'శ్రీకారం' చిత్రంలోని 'భలేగుంది బాలా' అనే ఫోక్ సాంగ్ కూడా సినిమా విజయానికి అతీతంగా సక్సెస్ సాధించింది. దీన్ని జానపద పాటల రచయిత పెంచల్ దాస్ పాడారు. దీనికి మిక్కీ జే మేయర్ సంగీతం అందించారు. 'చల్‌మోహన్‌రంగా' సినిమాలో 'నువు పెద్దపులి' అంటూ సాగిన పాటకు కూడా బాగానే వ్యూస్ వచ్చాయి. కొన్నేళ్లుగా తెలంగాణా పండుగల్లో ఈ పాటను ఎక్కువగా వింటున్న విషయం తెలిసిందే. రాహుల్ సిప్లిగంజ్, మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఇద్దరు కలిసి సాంగ్‌ను రీ క్రియేట్ చేశారు.

పలాస 1978లో 'నాది నక్లీసు గొలుసు' పాట కూడా సరికొత్త రికార్డును నెలకొల్పింది. ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల్లో బాగా పాపులర్ అయిన జానపదం ఇది. జానపద కళాకారుడు అసరయ్య ఈ పాట పాడుతూ జనాల్లోకి తీసుకెళ్లారు. రియాలిటీ షోలు, పెళ్లి వేడుకలు, టిక్‌టాక్ వంటి సోషల్ మీడియా యాప్‌లలో ఇది మార్మోగిపోయింది. 'లవ్ స్టోరీ' సినిమాలోని 'సారంగ దరియా...' పాటపై కూడా కొన్ని వివాదాలు చెలరేగాయి. తాను సేకరించి, పాడిన పాటను వాడుకున్నారంటూ ఒక సింగర్ సుద్దాల అశోక్‌తేజపై విమర్శలు చేశారు. కొన్నాళ్లకు వివాదం సద్దుమణిగింది.

రవితేజ నటించిన రాజాదిగ్రేట్ సినిమాలో 'గున్న గున్న మామిడి.. జీడీ గింజెలో.. జిల్లాటలో..' పాట కూడా బాగా ఆదరణ పొందింది. మాస్ పాటకి కొంచం కామెడీ టచ్ ఇచ్చి..ఈ పాట ను సినిమాకే హైలైట్ అయ్యేలా చేశారు. రంగస్థలం సినిమాలో 'ఆ గట్టునుంటావా' అంటూ సాగిన పాట కూడా సరికొత్తగా మెప్పించింది. ప్రముఖ జానపద సింగర్ శివనాగులు దీన్ని చాలా వేదికలపై, రియాలిటీ షోల్లో పాడారు. సందర్భోచితంగా ఉంటుందనే ఉద్దేశంతో ఈ సినిమా కోసం తీసుకున్నారు. చంద్రబోస్ లిరిక్స్‌ని మార్చి రాశారు. అవినీతి రాజకీయాల్ని ఎత్తిచూపే సందర్భాల్లో వస్తే ఈ పాట వినపడుతూనే ఉంటోంది. నాని నటించిన కృష్ణార్జునయుద్ధం సినిమాలో 'దారి చూడు....' జానపదం పాట దుమ్ము దులిపింది. దీన్ని రాసింది, పాడిందీ పెంచల్‌దాస్. అలవైకుంఠపురం సినిమాలో "రాములో రాములా... నన్నాగం జేసిందిరో" పాట కూడా సరికొత్త ఒరవడిని సృష్టించింది. మొత్తానికి కొత్త సినిమాల్లో పాత బాణీలు హోరెత్తిస్తున్నాయి. పాతకొత్తల మేలు కలయిక అంటే ఇదేనేమో!

ఆదివారం విరామం!

జట్టు సమావేశం, డెక్సా స్కాన్‌కు పరిమితం

భారత జట్టు ఆసియా కప్ క్యాంప్

బెంగళూర్ : వరుసగా రెండు మెగా ఈవెంట్లకు సన్నద్ధమవుతున్న టీమ్ ఇండియా.. ఆగస్టు 30 నుంచి ఆరంభం కానున్న ఆసియా కప్ ముంగిట బెంగళూర్‌లో శిక్షణ శిబిరంలో పాల్గొంటుంది. రెండు రోజుల పాటు మైదానంలో క్రికెటింగ్ డ్రిల్స్‌తో చెమటోడ్చిన రోహిత్‌సేన.. ఆదివారం మైదానం నుంచి కాస్త విరామం తీసుకుంది!. గ్రౌండ్‌కు వెళ్లకపోయినా.. క్రికెటర్లకు ఆశించిన విశ్రాంతి లభించలేదు. జాతీయ క్రికెట్ అకాడమీలో జట్టు సమావేశంలో పాల్గొన్న క్రికెటర్లు.. కీలక డెక్సా స్కాన్‌కు వెళ్లారు. బెంగళూర్ శివారులోని ఆలూర్ గ్రౌండ్స్‌లో భారత జట్టు సాధన చేస్తున్న సంగతి తెలిసిందే. ఆగస్టు 29తో శిక్షణ శిబిరం ముగియనుండగా.. మరుసటి రోజు బెంగళూర్ నుంచి కొలంబోకు భారత జట్టు బయల్దేరనుంది.

ప్రాక్టీస్ ప్రాక్టీస్ : ఆసియా కప్ క్యాంప్‌లో భాగంగా తొలి రోజు క్రికెటర్లు అందరూ యోయో ఫిట్‌నెస్ టెస్టుకు హాజరయ్యారు. ఐర్లాండ్ పర్యటన నుంచి వచ్చిన క్రికెటర్లు ఆ తర్వాత ఈ టెస్టు పూర్తి చేశారు. రెండో రోజు ఆలూర్ గ్రౌండ్స్‌లో బ్యాటింగ్ సాధన చేవారు. మూడో రోజు ప్రధానంగా మ్యాచ్ సిములేషన్స్ (అనుకరణలు)పై దృష్టి నిలిపారు. పేసర్లు యశ్ దయాల్, ఉమ్రాన్ మాలిక్ సహా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిలు చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ పర్యవేక్షణలో బ్యాటింగ్ జోడీలకు బౌలింగ్ చేశారు. నాల్గో రోజు గ్రౌండ్ వర్క్‌కు విరామం లభించగా క్రికెటర్లు కీలక డెక్సా స్కాన్ పరీక్షకు వెళ్లారు. ఇక చివరి రెండు రోజుల శిక్షణ శిబిరంలో సైతం మ్యాచ్ సిములేషన్స్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. లెఫ్ట్ ఆర్మ్ పేసర్లను ఎదుర్కోవటంలో భారత బ్యాటర్ల బలహీనత బహిరంగమే. అందుకోసం అనికెత్ చౌదరిని పిలిపించిన ద్రవిడ్.. రోహిత్ శర్మ, అండ్ మెన్‌ను సవాల్‌కు సిద్ధం చేశాడు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్లు సాయి కిశోర్, కుల్దీప్ యాదవ్ సహా మరో పది మంది నెట్ బౌలర్లు విరాట్ కోహ్లి బౌలింగ్ చేశారు. ప్రాక్టీస్‌లో భాగంగా శనివారం రెండు గంటల పాటు బ్యాటింగ్ చేసిన కెఎల్ రాహుల్.. వికెట్ కీపింగ్ సమయంలో ఇబ్బంది పడినట్టు కనిపించింది.

ఏమిటీ డెక్సా స్కాన్? : డెక్సా (డిఈఎక్స్ఏ) అనగా డ్యూయెల్ ఎనర్జీ ఎక్స్ రే అబ్సార్ప్షియోమెట్రీ. ఎముక మినరల్ డెన్సిటి, బోన్ డెన్సిటి మోతాదు శాతం తెలుసుకునేందుకు ఇదో ఓ శాస్త్రీయ పద్ధతి. ఈ పరీక్షలో రెండు ఎక్స్ రే బీమ్‌లు విభిన్న ఎనర్జీ లెవల్స్‌లో ఓ వ్యక్తి ఎముకపై పడతాయి. అందుకు అనుగుణంగా ప్రస్తుత ఎముక సాంద్రత, మినరల్ కంటెంట్ ఎంత ఉన్నాయనేది తెలుస్తుంది. ఈ పరీక్షతో గాయాల బారిన పడే ప్రమాదం నుంచి తప్పించటంతో పాటు, ప్రత్యేక డైట్ పాటించేందుకు సైతం ఉపయోగిస్తారు.

ట్రోఫీతో రాయలసీమ కింగ్స్ జట్టు క్రీడాకారుల విజయానందం

ఎపిఎల్-2 విజేత రాయలసీమ కింగ్స్

ప్రజాశక్తి - పిఎం.పాలెం (విశాఖపట్నం)

ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్) సీజన్ - 2 విజేతగా రాయలసీమ కింగ్స్ జట్టు నిలిచింది. విశాఖ పిఎం.పాలెం సమీపంలోని ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆ జట్టు కోస్టల్ రైడర్స్ జట్టును మట్టికరిపించింది. వర్షం కారణంగా ఈ మ్యాచ్‌ను 18 ఓవర్లుకు కుదించారు. తొలుత టాస్ గెలిచిన రాయలసీమ కింగ్స్ ఫీల్డింగ్ ఎంచుకుంది. కోస్టల్ రైడర్స్ జట్టు బ్యాట్స్‌మెన్లు 18 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ కింగ్స్ బ్యాట్స్‌మెన్లు 16.3 ఓవర్లులో 5 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసి టైటిల్‌ను సొంతం చేసుకున్నారు. ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్లు రాణించకపోయినప్పటికీ మిడిల్ ఆర్డర్‌లో దిగిన బిఎస్.వినయ్ కుమార్ 23 బంతుల్లో 5 సిక్స్‌లు, 4 ఫోర్లుతో 53 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. జిహెచ్.విహారి 29 బంతుల్లో 46 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు.

వీరిద్దరూ 52 బంతుల్లో 99 పరుగులు చేశారు. చివర్లో దిగిన పి.గిరినాథ్ రెడ్డి 17 బంతుల్లో 29 పరుగులు చేశారు. విజేత జట్టుకు ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ భారత క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్, టిటిడి మాజీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి ట్రోఫీ అందజేశారు.

స్లాన్ అంతర్జాతీయ చెస్ చాంప్ శుభమ్ కుమార్

- రన్నరప్స్‌గా యశ్వి జైన్, సాత్విక్ డివిఎస్ఎస్‌యు

హైదరాబాద్: మూడురోజుల పాటు ఉత్సాహభరితంగా సాగిన స్లాన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్ ఆదివారం ఘనంగా ముగిసింది. ఫిడె 1600 రేటింగ్ చెస్ మాస్టర్లు తలపడిన ఈ టోర్నీలో అమెరికా, కెనడా, యెమన్ సహా భారత్ నుంచి 15 రాష్ట్రాల చెస్ క్రీడాకారులు పోటీపడ్డారు. 575 మంది పాల్గొన్న స్లాన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్ చాంపియన్‌గా బిహార్‌కు చెందిన శుభమ్ కుమార్ విజేతగా నిలిచాడు. తెలంగాణ అమ్మాయి యశ్వి జైన్ ద్వితీయ స్థానంలో నిలువగా, ఆంధ్రపదేశ్‌కు చెందిన సాత్విక్ డివిఎస్ఎస్‌యు తతీయ స్థానంలో నిలిచారు.

యూసుఫ్‌గూడలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన ముగింపు వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరైన సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయక్ విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. విజేత రూ.1 లక్ష, రన్నరప్ రూ.60 వేలు, సెకండ్ రన్నరప్ రూ.40 వేలు నగదు బహుమతి దక్కించుకున్నట్లు నిర్వాహకులు, స్లాన్ స్పోర్ట్స్ సీఓఓ నవీన్ నాయక్ తెలిపారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68